RNI No Tel / 2012 /4241

ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..

# హైదరాబాద్ ఎస్టేట్

తెలుగు దిన పత్రిక

THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER

hyderabadestate.co.in




సంపుటి -13 సంచిక - 426 | 18 శనివారం జూలై 2026 | ఎడిటర్: బట్టు లక్ష్మీ నారాయణ | పేజీలు - 6 వెల రూ 5 /--

## కాంగ్రెస్ డిక్లరేషన్ల వైఫల్యాలను

# ఎండగడుదాం..

### కేటీఆర్ పిలుపు




యూత్ డిక్లరేషన్ పేరిట యువత, నిరుద్యోగులకు కాంగ్రెస్ ప్రభుత్వం భారీ మోసం చేసిందని బీఆర్ఎస్ వరింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ ఇచ్చిన డిక్లరేషన్లలోని హామీల వైఫల్యాలను ప్రజలకు వివరించేందుకు బీఆర్ఎస్ వరుసగా సభలు నిర్వహిస్తున్నదని తెలిపారు. వరంగల్ రైతు సభ అనంతరం, ఈ నెల 18న సరూర్‌నగర్ స్టేడియంలో యువత, విద్యార్థులతో భారీ యువజన సదస్సు నిర్వహించనున్నట్టు కేటీఆర్ ప్రకటించారు.జఱఎ & రాశీఝ్రీ +బఱఎవం తద్వారా కాంగ్రెస్ యూత్ డిక్లరేషన్ వైఫల్యాలను ప్రజల ముందుంచనున్నట్టు పేర్కొన్నారు. గురువారం ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి నివాసంలో బీఆర్ఎస్ హైదరాబాద్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ప్రజాప్రతినిధులు, పార్టీ నేతల విస్తృత స్థాయి సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు. యువ సంగ్రామ సభకు కాంగ్రెస్ పార్టీ అడ్డంకులు సృష్టించే అవకాశం ఉన్నదని, అలాంటి ప్రయత్నాలను సమర్థంగా ఎదురొనేందుకు నాయకులు, కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని కేటీఆర్ సూచించారు.

హైదరాబాద్‌తోపాటు పరిసర అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి కూడా భారీ సంఖ్యలో యువత స్వచ్ఛందంగా సభకు తరలివస్తారని పార్టీ సీనియర్ నాయకులు కేటీఆర్‌కు వివరించారు. సభ ఏర్పాట్లు, నిర్వహణ, విజయవంతం చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలపై సమావేశంలో సుదీర్ఘంగా చర్చించారు.

కాంగ్రెస్‌ది ప్రజాకంటక పాలన

కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా ప్రజల నమ్మకాన్ని కోల్పోయిందని, కేవలం సగం పదవీకాలం పూర్తికాకముందే తీవ్ర ప్రజా వ్యతిరేకతను మూటగట్టుకున్న ప్రభుత్వంగా చరిత్రలో నిలిచిపోతుందని కేటీఆర్ పేర్కొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతున్న మాటలు, అనుసరిస్తున్న విధానాలు, సాగిస్తున్న పాలన ప్రజాకంటకంగా మారాయని విమర్శించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలుచేయకుండా అన్ని వర్గాలను మోసం చేసిందని, అందుకే సమాజంలోని ప్రతి వర్గం తీవ్రంగా వ్యతిరేకిస్తున్నదని చెప్పారు. సీఎం చేయించిన సర్వేలోనే కాంగ్రెస్ సర్కార్‌పై తీవ్రమైన ప్రజావ్యతిరేకత వ్యక్తమైందని పేరొన్నారు.ప్రభుత్వకాలం ముగిసిపోతుందనే విషయం స్పష్టమవుతున్న నేపథ్యంలోనే సీఎం అడ్డగోలుగా మాట్లాడుతూ తన అకసును వెళ్లగకుతున్నారని చెప్పారు. ఒకవైపు వ్యవసాయరంగం తీవ్ర సంక్షోభంలో, కరువు అంచున ఉంటే.. సీఎం వ్యాఖ్యలు ప్రజలందరిలో తీవ్ర ఆగ్రహాన్ని తెప్పించాయని పేరొన్నారు. చివరికి రైతులు కూడా 'మా రక్తాన్ని తీసుకోండి.. కానీ మా పొలాలకు నీళ్లివ్వండి' అని డిమాండ్ చేసే పరిస్థితిని ప్రభుత్వం తీసుకొచ్చిందని కేటీఆర్ విమర్శించారు.కాంగ్రెస్ పూర్తిగా ప్రజల నమ్మకాన్ని కోల్పోయింది. కేవలం సగం పదవీకాలం పూర్తికాకముందే తీవ్ర ప్రజా వ్యతిరేకతను మూటగట్టుకున్న ప్రభుత్వంగా చరిత్రలో నిలిచిపోతుంది. రేవంత్ మాటలు, అనుసరిస్తున్న విధానాలు, సాగిస్తున్న పాలన ప్రజాకంటకంగా మారాయి.



# తెలంగాణలో వానలు..

### ఉక్కపోత నుంచి ఉపశమనం

గత కొన్ని రోజులుగా తీవ్రమైన ఎండలు, ఉక్కపోతతో అల్లాడుతున్న తెలంగాణ ప్రజలకు వాతావరణ శాఖ చల్లని కబురు అందించింది. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. పలు జిల్లాల్లో మోస్తరు వర్షాలు కురుస్తుండటంతో ప్రజలకు వేడి నుంచి ఉపశమనం లభించింది. ఈ నెల 22వ తేదీ వరకు రాష్ట్రంలో పలుచోట్ల వర్షాలు కొనసాగే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది.బంగాళాఖాతంలో ఉత్తర ఒడిశా-పశ్చిమబెంగాల్ తీర ప్రాంతంలో అల్పపీడనం ఏర్పడింది. దీనికి అనుబంధంగా మరో ద్రోణి కొనసాగుతోంది. వీటి ప్రభావంతో తెలంగాణలో ముఖ్యంగా ఉత్తర, మధ్య జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. కొన్ని ప్రాంతాల్లో బలమైన ఈదురు గాలులు కూడా వీచే అవకాశం ఉందని హెచ్చరించారు. ఇప్పటికే ఇవాళ తెల్లవారుజామున హైదరాబాద్ నగరంలోని పలు ప్రాంతాల్లో వర్షం కురిసింది. రేపు ఉత్తర తెలంగాణ జిల్లాల్లో బలమైన ఉపరితల గాలులు వీస్తాయని అంచనా వేస్తున్నారు.నిన్న సాయంత్రం నుంచే రాష్ట్రంలోని పలు జిల్లాల్లో వాతావరణం చల్లబడింది. రంగారెడ్డి జిల్లా రెడ్డిపల్లిలో 4.3 సెంటీమీటర్లు, నల్గొండ జిల్లా చండూరులో 3.5 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. రంగారెడ్డి, సంగారెడ్డి, వికారాబాద్, మహబూబ్‌నగర్, ములుగు, మంచిర్యాల, ఆసిఫాబాద్ జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు జల్లులు పడ్డాయి. నిన్న పగటిపూట నిజామాబాద్‌లో సాధారణం కన్నా 3.8 డిగ్రీలు అధికంగా 35.5 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కాగా, సాయంత్రానికి వాతావరణం చల్లబడటం గమనార్హం.నైరుతి రుతుపవనాలు రాష్ట్రంలో ప్రవేశించినప్పటికీ ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఖరీఫ్ సాగు పనులు నెమ్మదించాయి. ఇలాంటి తరుణంలో అల్పపీడనం కారణంగా కురుస్తున్న ఈ వర్షాలు వ్యవసాయ పనులకు ఊతమిస్తాయని, పంటలకు జీవం పోస్తాయని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా భారీ వర్షాలు లేకపోయినా, ఈ జల్లులు ఎండల తీవ్రతను తగ్గించి ప్రజలకు, రైతులకు కొంత ఊరటనిస్తున్నాయి.



### మోదీ, చంద్రబాబు వచ్చాక

# పరిస్థితులు మారాయి

### : నరసరావుపేటలో నిర్మలా సీతారామన్

ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు లాంటి నేతలు అధికారంలోకి వచ్చాక దేశంలో పరిస్థితులు పూర్తిగా మారాయని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. గతంలో ఫోన్ బ్యాంకింగ్ ద్వారా ఎవరికి రుణాలు ఇవ్వాలో నిర్దేశించే వారని, కానీ ఇప్పుడు బ్యాంకులు నేరుగా ప్రజల వద్దకే వెళ్లి అర్హులైన వారికి అండగా నిలుస్తున్నాయని స్పష్టం చేశారు. పల్నాడు జిల్లా నరసరావుపేటలో ప్రభుత్వ రంగ బ్యాంకులు సంయుక్తంగా నిర్వహించిన 'క్రెడిట్ అవుట్‌రీచ్' కార్యక్రమంలో ఆమె ముఖ్యమంత్రి చంద్రబాబుతో కలిసి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, పలువురు బ్యాంకుల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా నిర్మలా సీతారామన్ మాట్లాడుతూ, బ్యాంకులు ప్రజల వద్దకు వెళ్లి సేవలు అందించాలన్నది ప్రధాని మోదీ ఆలోచన అని తెలిపారు. 2004 నుంచి 2014 మధ్య కేంద్రంలో ఉన్న ప్రభుత్వం, ఫోన్ కాల్స్ ద్వారా తమకు కావాల్సిన వారికి రుణాలు ఇప్పించుకునేదని, కానీ ఎన్డీయే ప్రభుత్వం వచ్చాక ఆ విధానానికి స్వస్తి పలికిందని విమర్శించారు. ప్రస్తుతం గ్రామగ్రామాన బ్యాంకులు పర్యటించి, ఎలాంటి హామీ లేకుండా అర్హత ఉన్నవారికి రుణాలు అందిస్తున్నాయని చెప్పారు. వీధి వ్యాపారులకు సైతం ప్రభుత్వమే గ్యారెంటీ ఇచ్చి వారి వ్యాపారాలకు చేయూతనిస్తోందని వివరించారు. అధిక వడ్డీలకు అప్పులిచ్చే వ్యాపారుల బారిన పడకుండా మైక్రో ఫైనాన్స్ ద్వారా మహిళలు, చిరు వ్యాపారులను ఆదుకోవడమే తమ లక్ష్యమన్నారు.దేశవ్యాప్తంగా బ్యాంకులు తమ పనితీరును, ప్రజలు బ్యాంకుల పట్ల తమ దృక్పథాన్ని మార్చుకున్నారని, నరసరావుపేటలో జరిగిన ఈ రుణమేళానే దానికి నిదర్శనమని అన్నారు. వ్యాపారవేత్తలుగా, పారిశ్రామికవేత్తలుగా ఎదిగేందుకు కోట్లాది రూపాయల రుణాన్ని బ్యాంకులు అందించాయని తెలిపారు. 2047 నాటికి భారతదేశాన్ని అగ్రగామి అభివృద్ధి చెందిన దేశంగా, 'వికసిత్ భారత్'గా నిలబెట్టడమే తమ ప్రభుత్వ ధ్యేయమని ఆమె పునరుద్ఘాటించారు.ఈ కార్యక్రమంలో భాగంగా, కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కింద యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సమకూర్చిన అంబులెన్స్‌లను సీఎం చంద్రబాబు, కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం బాలికలకు సైకిళ్లను పంపిణీ చేసి, వివిధ రంగాలకు చెందిన లబ్ధిదారులకు రుణాలను వితరణ చేశారు.

# అమెరికా ఎన్నికల్లో చైనా జోక్యం చేసుకున్నది

### : డోనాల్డ్ ట్రంప్



న్యూయార్క్: అమెరికా దేశాధ్యక్ష ఎన్నికల్లో డ్రాగన్ దేశం చైనా జోక్యం చేసుకున్నట్లు అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్(ణశీఅఱశ్రీస ఎతీబఎజూ) ఆరోపించారు. దేశ ప్రజలను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. 2020 దేశాధ్యక్ష ఎన్నికల్లో చైనా జోక్యం చేసుకున్నదని, అమెరికా ఓటింగ్ విధానం తీవ్ర ప్రభావానికి గురైందని, అయితే ఓటర్లను మార్చిన అంశంపై మాత్రం ఆయన క్లారిటీ ఇవ్వలేదు. ఎన్నికల ఫలితాలను కూడా మార్చినట్లు ట్రంప్ నేరుగా పేర్కొనలేదు. వైట్‌హౌజ్ నుంచి ఆయన మాట్లాడుతూ.. ఓటింగ్ ఫ్రాడ్ జరిగినట్లు ట్రంప్ పేర్కొన్నారు. కానీ దానికి సంబంధించిన ఆధారాలను మాత్రం ఆయన స్పష్టంగా వెల్లడించలేదు. 2020 దేశాధ్యక్ష ఎన్నికల్లో జరిగిన హోరాహోరీ పోరులో జో బైడెన్ చేతిలో ట్రంప్ ఓటమి పాలయ్యారు.మిడ్‌టర్మ్ ఎన్నికల నేపథ్యంలో ట్రంప్ తాజాగా ప్రసంగం చేశారు. ఇంటెలిజెన్స్‌కు చెందిన వందలాది ఫైళ్లను డీక్లాసిఫై చేశానని, అయితే బైడెన్‌కు అనుకూలంగా దేశాధ్యక్ష ఎన్నికలను చైనా ప్రభావితం చేసినట్లు ఆ ఫైళ్లలో ఉందని ట్రంప్ తెలిపారు. కానీ 2020 ఎన్నికల్లో చైనా జోక్యం లేదని అమెరికా ఇంటెలిజెన్స్ వర్గాలు మాత్రం చెబుతూనే ఉన్నాయి. ట్రంప్ చేసిన వ్యాఖ్యలకు చైనా విదేశాంగ శాఖ తీవ్రంగా కౌంటర్ ఇచ్చింది. ఆ ఆరోపణలన్నీ అవాస్తవాలు అని పేర్కొన్నది. ఎటువంటి ఆధారాలు లేని వ్యాఖ్యలను ట్రంప్ చేస్తున్నారని చైనా విదేశాంగ ప్రతినిధి లిన్ జియాన్ అన్నారు. చైనా సుమారు 22 కోట్ల ఓటర్ ఫైళ్లను అక్రమ రీతిలో సేకరించినట్లు ట్రంప్ ఆరోపించారు. సుమారు 18 రాష్ట్రాల్లో ఓటరు డేటాను చైనా హ్యాక్ చేసిందన్నారు. అయితే ఓటరు డేటా ఆధారంగా ఎన్నికల వ్యవస్థపై చైనా ప్రభావం చూపినట్లుగా ట్రంప్ ఎటువంటి ఆధారాలను తన ప్రసంగంలో వెల్లడించలేదు.ఎలక్ట్రానిక్ ఓటింగ్, బ్యాలెట్ కౌంటింగ్ వ్యవస్థల్లో అక్రమాలు జరిగినట్లు వైట్‌హౌజ్ సుమారు నాలుగు సెక్షన్ల డాక్యుమెంట్లను రిలీజ్ చేసింది. అమెరికా ఓటరు డేటాను చైనా దుర్వినియోగం చేసినట్లు ట్రంప్ పేర్కొన్నారు.

# 247 మంది స్టాఫ్ నర్సులకు నియామక పత్రాలు

### అందజేసిన ఉపముఖ్య మంత్రి భట్టి, మంత్రి వివేక్




మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు (ఎంహెచ్ఎస్ఆర్‌బీ) ద్వారా ఎంపికైన 247 మంది స్టాఫ్ నర్సులకు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కతో కలిసి మంత్రి డా. వివేక్ వెంకటస్వామి నియామక పత్రాలు అందజేశారు. శుక్రవారం కొమురం భీం ఆదివాసీ భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి వివేక్ మాట్లాడుతూ.. కార్మికులు, వారి కుటుంబాలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంలో నర్సింగ్ సిబ్బంది కీలక పాత్ర పోషిస్తారని, అందుకే సిబ్బంది కొరతను పూర్తిగా తొలగించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు.ప్రస్తుతం ఈఎస్ఐ సేవలు రాష్ట్రంలోని సుమారు 20 లక్షల మంది బీమా పొందిన కార్మికులకు, వారి కుటుంబ సభ్యులతో కలిపి దాదాపు 75 లక్షల మంది లబ్ధిదారులకు అందుతున్నాయని మంత్రి తెలిపారు. ఆస్పత్రుల్లో మెరుగైన వైద్య సేవలు అందించాలంటే వైద్యులు, నర్సులు, పారామెడికల్ సిబ్బంది, మందులు, ఆధునిక వైద్య పరికరాలు అందుబాటులో ఉండాలని అన్నారు. రాష్ట్రంలోని అన్ని ఈఎస్ఐ ఆస్పత్రులను ఆధునిక సదుపాయాలతో అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు.ఇటీవల కేంద్ర కార్మిక శాఖ మంత్రి మన్సుఖ్ మాండవీయతో కూడా ఈ అంశాలపై చర్చించినట్లు తెలిపారు. సనత్‌నగర్ ఈఎస్ఐ ఆస్పత్రిపై ఉన్న భారాన్ని తగ్గించేందుకు రామచంద్రాపురం ఈఎస్ఐ ఆస్పత్రిలో డయాలసిస్ యూనిట్, కార్డియాక్ కేర్ సెంటర్ ఏర్పాటు చేసి ప్రత్యేక వైద్య సేవలను విస్తరిస్తున్నామని తెలిపారు. అలాగే నాచారం ఈఎస్ఐ ఆస్పత్రిలో డయాలసిస్ సేవలను బలోపేతం చేసి కార్డియాక్ సేవలను ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. దీంతో కార్మికులకు తమ ప్రాంతానికే మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయని చెప్పారు.

RNI No Tel / 2012 /4241
ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..
హైద్రాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
తెలుగు దిన పత్రిక
hyderabadestate.co.in
18 శనివారం జూలై 2026

## అస్వస్థుడికి రూ.3 లక్షల ఎల్ఓసీ.. కుటుంబానికి అండగా మర్రి నిరంజన్ రెడ్డి

హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి జులై 17:
రంగారెడ్డి జిల్లా: ఇబ్రహీంపట్నం నియోజకవర్గం మంచాల్ మండలం లోయపల్లి గ్రామానికి చెందిన కొర్ర రమేష్ నాయక్ అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ వైద్య ఖర్చుల భారం ఎదుర్కొంటున్న నేపథ్యంలో ఆయన కుటుంబానికి ఆర్థిక ఊరటనిచ్చేలా రూ.3 లక్షల విలువైన ఎల్ఓసీ (లెటర్ ఆఫ్ క్రెడిట్) అందజేశారు. టీపీసీసీ సభ్యులు, ఇబ్రహీంపట్నం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, ఆదిభట్ల మున్సిపాలిటీ చైర్మన్ మర్రి నిరంజన్ రెడ్డి చొరవతో, తెలంగాణ రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి సహకారంతో ఈ ఎల్ఓసీ మంజూరైంది. మంజూరైన పత్రాన్ని గురువారం రమేష్ నాయక్ సోదరుడు కొర్ర భాస్కర్ నాయక్‌కు మర్రి నిరంజన్ రెడ్డి అందజేశారు.
ఈ సందర్భంగా రమేష్ నాయక్ కుటుంబ సభ్యులు మాట్లాడుతూ, క్లిష్ట సమయంలో తమ సమస్యను గుర్తించి వెంటనే స్పందించి వైద్య సహాయం అందేలా కృషి చేసిన మర్రి నిరంజన్ రెడ్డికి, అలాగే మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పేద కుటుంబాలకు అవసరమైన



సమయంలో ఇలాంటి సహాయం ఎంతో ఊరటనిస్తుందని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గణేష్ నాయక్, మోహన్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## డ్రంకెన్ డ్రైవ్, లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపిన వారిపై కోర్టు చర్యలు

హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి జులై 17:-
రంగారెడ్డి జిల్లా: ఇబ్రహీంపట్నం ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన ముగ్గురు మద్యం సేవించి వాహనాలు నడిపిన వ్యక్తులతో పాటు డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపిన నలుగురు వాహనదారులను శుక్రవారం న్యాయస్థానం ముందు హాజరుపరిచారు. విచారణ అనంతరం డ్రంకెన్ డ్రైవ్, లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపిన కేసులన్నింటికీ కలిపి న్యాయస్థానం రూ.24,500 జరిమానా విధించింది. అధిక మోతాదులో మద్యం సేవించి వాహనం నడిపిన ఖానాపూర్‌కు చెందిన ఎం. వెంకట్ రెడ్డి, వి. శ్రీనివాస్‌లకు జరిమానాతో పాటు ఒక రోజు ట్రాఫిక్ విధులు నిర్వహించాలని న్యాయస్థానం ఆదేశించింది. కోర్టు ఆదేశాల మేరకు ఇబ్రహీంపట్నం జంక్షన్‌లో వారిద్దరితో ట్రాఫిక్ విధులు నిర్వహింపజేశారు. ఈ కార్యక్రమాన్ని ఇబ్రహీంపట్నం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ సి.హెచ్. జితేందర్ రెడ్డి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ పోలీసులు ప్రజలకు పలు సూచనలు చేశారు. మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల తమ ప్రాణాలతో పాటు ఇతరుల ప్రాణాలు




కూడా ప్రమాదంలో పడతాయని హెచ్చరించారు. చెల్లుబాటు అయ్యే డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడపవద్దని, మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదని సూచించారు. ట్రాఫిక్ నిబంధనలను ప్రతి పౌరుడు తప్పనిసరిగా పాటించడం సామాజిక బాధ్యత అని ట్రాఫిక్ పోలీసులు విజ్ఞప్తి చేశారు.

# నగదు రహిత వైద్యం చారిత్రాత్మక నిర్ణయం..

## ప్రభుత్వానికి జేఏసీ చైర్మన్ లక్ష్మారెడ్డి కృతజ్ఞతలు

హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి ఇరిగి అశోక్.
ప్రభుత్వం ఉద్యోగులకు పెన్షనర్లకు ఆరోగ్య భద్రత కల్పించడం హర్షనీయమని ఉద్యోగుల జేఏసీ చైర్మన్ ఎంప్లాయిస్ హెల్త్ కేర్ ట్రస్ట్ మెంబర్ వి. లక్ష్మారెడ్డి అభిప్రాయపడ్డారు. నగదు రహిత వైద్య సేవలు చారిత్రాత్మక నిర్ణయం అన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఉద్యోగుల పెన్షనర్ల తరఫున సీఎం రేవంత్ రెడ్డి డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క మంత్రి దామోదర్ రాజనర్సిములకు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులు పెన్షనర్లకు నాణ్యమైన. నగదు రహిత వైద్య సేవలను అందించాలనే సంకల్పంతో ఎంప్లాయ్ హెల్త్ కేర్ ట్రస్ట్ అమలుకు శ్రీకారం చుట్టడం జరిగిందని తెలిపారు. హెల్త్ స్కీమ్ పథకం రూపకల్పన అమలులో విశేష కృషి చేసిన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కి ధన్యవాదాలు తెలిపారు. ఉద్యోగులు పెన్షనర్ల ఆరోగ్య భద్రతకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంతో ఆరోగ్య భరోసా పెరుగుతుందన్నారు. ఉద్యోగుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి పని చేస్తుందన్నారు. భవిష్యత్తులో కూడా ఉద్యోగుల సంక్షేమానికి ఇదే స్ఫూర్తితో మరిన్ని సంక్షేమ కార్యక్రమాలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపిన వారిలో రాష్ట్ర అధ్యక్షులు రాజశేఖర్ టి జి టి ఏ రాష్ట్ర అధ్యక్షులు ఎస్ రాములు టి జి ఆర్ ఎస్ ఏ రాష్ట్ర అధ్యక్షులు .బాణాల రామ్ రెడ్డి. ఎస్



రాములు.రమేష్ పాక. రాధా. నిర్మల. బిక్షం. ఉపేందర్ రావులతోపాటు వివిధ ఉద్యోగ పెన్షనర్ల సంఘాల నాయకులు జేఏసీ నాయకులు ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

## బొల్లికుంట ఘటనపై పోలీసుల తీరును ఖండించిన రంజిత్ కుమార్

### – గంట రవికుమార్ అరెస్టును తప్పుబట్టిన బీజేపీ నాయకుడు..
### – ప్రజల మనోభావాలను గౌరవించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి

వరంగల్, జూలై 17 హైదరాబాద్ ఎస్టేట్:
బొల్లికుంట ఘటనలో పోలీసులు వ్యవహరించిన తీరును బీజేపీ నాయకుడు కనుకుంట్ల రంజిత్ కుమార్ ఖండించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజాస్వామ్య ప్రభుత్వానికి ప్రజల పట్ల బాధ్యతాయుతమైన వైఖరి ఉండాలని, అయితే బొల్లికుంట ఘటనలో పోలీసుల చర్యలు అందుకు విరుద్ధంగా కనిపిస్తున్నాయని ఆరోపించారు. అసమ్మతిని వ్యక్తం చేసే వారిపై చర్యలు తీసుకోవడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి అనుకూలం కాదని వ్యాఖ్యానించారు. గంట రవికుమార్ అరెస్టుతో ప్రశ్నించే గొంతులను అణచివేసే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. అలాంటి చర్యలతో ప్రజల్లోని దేశభక్తి భావాలను అణచివేయడం సాధ్యం కాదని పేర్కొన్నారు. ఛత్రపతి శివాజీ మహారాజ్ దేశానికి స్ఫూర్తిదాయక మహనీయుడని పేర్కొన్న ఆయన, శివాజీ మహారాజ్ విగ్రహ ఏర్పాటును అడ్డుకున్నారని ఆరోపిస్తూ, అలాంటి చర్యలు ప్రజల మనోభావాలను దెబ్బతీసే అవకాశముందని అన్నారు. ప్రజాప్రభుత్వం ప్రజల మనోభావాలను గౌరవిస్తూ




వ్యవహరించాలని, అణచివేత ధోరణికి తావు ఇవ్వకూడదని ప్రభుత్వాన్ని కోరారు. చివరగా "జై శివాజీ.. జై భవానీ" అంటూ తన ప్రసంగాన్ని ముగించారు.

## గ్రామకంఠం భూమి కోసం దండుమైలారం రోడ్డెక్కింది

హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి జులై 17:-
రంగారెడ్డి జిల్లా: ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోని దండుమైలారం గ్రామంలో గ్రామకంఠం భూమి వివాదం ఉద్రిక్తతకు దారితీసింది. గ్రామ సర్పంచ్ ఆధ్వర్యంలో గ్రామస్తులు పెద్ద సంఖ్యలో రోడ్డుపై బైఠాయించి నిరసన చేపట్టారు. గ్రామస్తుల ఆరోపణల ప్రకారం, జనార్దన్ రెడ్డి అనే వ్యక్తికి 194 గజాల వ్యక్తిగత భూమి మాత్రమే ఉండగా, అప్పట్లో గ్రామ కార్యదర్శిగా పనిచేసిన తన బంధువు సహకారంతో తన పలుకుబడిని ఉపయోగించి సుమారు నాలుగు ఎకరాలకు పైగా గ్రామకంఠం భూమిని ఆక్రమించి, ఆ స్థలానికి ప్రహరీ గోడ నిర్మించుకున్నారని ఆరోపించారు.ఆక్రమణకు గురైన గ్రామకంఠం భూమిని వెంటనే స్వాధీనం చేసుకుని గ్రామపంచాయతీకి అప్పగించాలని నిరసనకారులు డిమాండ్ చేశారు. గ్రామంలో ఇళ్ల స్థలాలు లేని నిరుపేద కుటుంబాలకు అదే భూమిలో ఇంటి స్థలాల పట్టాలు మంజూరు చేయాలని సర్పంచ్‌తో పాటు గ్రామ ప్రజలు ప్రభుత్వాన్ని కోరారు. గ్రామకంఠం భూములను పరిరక్షించేందుకు రెవెన్యూ అధికారులు



వెంటనే సమగ్ర సర్వే నిర్వహించి, ఆక్రమణలు నిజమైతే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు.ఈ సందర్భంగా గ్రామస్తులు నినాదాలు చేస్తూ తమ డిమాండ్లు నెరవేర్చే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని హెచ్చరించారు.

## ఆధారాలతోనే ఆరోపణలు చేయాలి

### దాడి శివ

### పీఏసీఎస్ నియామకాలపై ప్రచురిత కథనంపై స్పందన




గీసుగొండ, జూలై 17 హైదరాబాద్ ఎస్టేట్:
పీఏసీఎస్ చైర్మన్, వైస్ చైర్మన్ నియామకాలపై ఇటీవల ప్రచురితమైన కథనాల నేపథ్యంలో గీసుగొండ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దాడి శివ స్పందించారు. ప్రజా ప్రయోజనాలకు సంబంధించిన అంశాలపై వార్తలు ప్రచురించే సమయంలో వాస్తవాలు, ధృవీకరించిన సమాచారం, సంబంధిత పక్షాల వివరణ, ఆధారాలకు ప్రాధాన్యం ఇవ్వడం జర్నలిస్టిక్ బాధ్యత అని ఆయన అన్నారు. ప్రచురితమైన కథనంలో చేసిన ఆరోపణలకు సంబంధించి ఎలాంటి ఆధారాలు ఉన్నా వాటిని ప్రజల ముందుంచడంతో పాటు సంబంధిత అధికారులకు సమర్పించాలని సూచించారు. ఆరోపణలు ఎవరిపై ఉన్నాయో స్పష్టంగా పేర్కొని, వాటికి సంబంధించిన పత్రాలు, ఆడియో, వీడియోలు లేదా ఇతర ధృవీకరణ ఆధారాలు ఉంటే వాటి ఆధారంగా విచారణ కోరడం చట్టబద్ధమైన మార్గమని పేర్కొన్నారు. నిజంగా ఏవైనా అక్రమాలు జరిగాయని భావిస్తే సంబంధిత శాఖలకు ఫిర్యాదు చేసి నిష్పాక్షిక విచారణ కోరాలని, వాస్తవాలు వెలుగులోకి రావడం ప్రజాస్వామ్య వ్యవస్థకు మేలు చేస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. పీఏసీఎస్ నియామకాల ప్రక్రియ సహకార శాఖ మార్గదర్శకాలు, నిబంధనల ప్రకారమే కొనసాగుతోందని దాడి శివ తెలిపారు. పార్టీ కోసం పనిచేసిన ప్రతి కార్యకర్తకు న్యాయం జరిగేలా పార్టీ నాయకత్వం నిర్ణయాలు తీసుకుంటుందనే విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. సంబంధిత అన్ని పక్షాల అభిప్రాయాలు, అధికారిక సమాచారం సేకరించిన అనంతరం వార్తలు ప్రచురిస్తే ప్రజలకు సమతుల్యమైన, విశ్వసనీయమైన సమాచారం అందుతుందని పేర్కొన్నారు. ఆధారాలు ఉంటే వాటిని సంబంధిత అధికారులకు సమర్పించి చట్టబద్ధమైన విచారణ కోరాలని, ప్రజా చర్చలు వాస్తవాలు, ధృవీకరణ ఆధారంగానే సాగడం ప్రజాస్వామ్యానికి, ప్రజా ప్రయోజనాలకు మేలు చేస్తుందని దాడి శివ అన్నారు.

## పార్కు స్థల కబ్జాపై పోలీసులకు ఫిర్యాదు..

### చర్యలు తీసుకోవాలని డిమాండ్



హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి జూలై 17:-
ఉమ్మడి బీఎన్ రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని మారుతీ నగర్ కాలనీలో పార్కు స్థలాన్ని అక్రమంగా కబ్జా చేసి నిర్మాణాలు చేపడుతున్న వారిపై వెంటనే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని తాజా మాజీ కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి డిమాండ్ చేశారు. విశ్వహిందూ పరిషత్ జాతీయ అధికార ప్రతినిధి రావినూతల శశిధర్, రంగారెడ్డి జిల్లా అర్బన్ ప్రభారి ఆలె భాస్కర్, జిల్లా అధ్యక్షుడు వనపల్లి శ్రీనివాస్ రెడ్డి, ఎల్బీనగర్ అసెంబ్లీ ఇంచార్జ్ సామ రంగారెడ్డి తదితరులతో కలిసి కబ్జాకు గురైన స్థలాన్ని పరిశీలించి, అనంతరం కాలనీవాసులతో కలిసి వనస్థలిపురం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ప్రజలకు ఉపయోగపడాల్సిన పార్కు స్థలాన్ని ఆక్రమించి నిర్మాణాలు చేపట్టడం చట్టవిరుద్ధమని పేర్కొన్నారు. సంబంధిత అధికార యంత్రాంగం తక్షణమే స్పందించి ఆక్రమణలను తొలగించి పార్కు స్థలాన్ని సంరక్షించాలని కోరారు. త్వరితగతిన చర్యలు తీసుకోకపోతే ప్రజలతో కలిసి ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ, విశ్వహిందూ పరిషత్ నాయకులు, బీజేవైఎం ప్రతినిధులు, కాలనీ అధ్యక్షులు, మహిళలు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## జూలై 20న 'చలో కలెక్టరేట్'ను జయప్రదం చేయాలి: సీఐటీయూ

హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి జులై 17:-
తెలంగాణ బిల్డింగ్ అండ్ అదర్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ ఫెడరేషన్ (౧దీ&ూజఔఖీ) ఆధ్వర్యంలో జూలై 20న నిర్వహించనున్న "చలో రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్" కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని



సీఐటీయూ రంగారెడ్డి జిల్లా సహాయ కార్యదర్శి ఆలేటి ఎల్లయ్య పిలుపునిచ్చారు. శుక్రవారం వనస్థలిపురం ఎన్‌జీవోస్ కాలనీలోని లేబర్ అడ్డా వద్ద సీడబ్ల్యూఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి పొట్టేపాకు రామస్వామి అధ్యక్షతన కరపత్రాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆలేటి ఎల్లయ్య మాట్లాడుతూ, భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ నిధులను ఇన్సూరెన్స్, హెల్త్ టెస్టుల పేరుతో దుర్వినియోగం చేస్తున్నారని ఆరోపించారు. హెల్పర్ బోర్డు ద్వారా అమలవుతున్న సంక్షేమ పథకాలను ప్రైవేటీకరించే చర్యలను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. జీఓ నెం.12ను రద్దు చేసి, కార్మికులకు సంక్షేమ పథకాలను హెల్పర్ బోర్డు ద్వారానే ప్రభుత్వం అమలు చేయాలని కోరారు. సహజ మరణ పరిహారాన్ని రూ.5 లక్షలకు పెంచడం, రూ.54 వేల పెండింగ్ క్లెయిమ్‌లను వెంటనే చెల్లించడం, నెలకు రూ.6 వేల పెన్షన్, హెల్త్ కార్డులు, కార్మికులకు ఇళ్ల స్థలాలు, ఇందిరమ్మ ఇళ్ల మంజూరు వంటి డిమాండ్లను నెరవేర్చాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో అడ్డా అధ్యక్షుడు రాజు అంజయ్య, కార్యదర్శి అంజయ్య గౌడ్, సహాయ కార్యదర్శి చుక్క రాములు, మల్లేష్, రాము, నిర్మలమ్మ, లక్ష్మమ్మతో పాటు పెద్ద సంఖ్యలో నిర్మాణ కార్మికులు పాల్గొన్నారు.

RNI No Tel / 2012 /4241
హైద్రాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
తెలుగు దిన పత్రిక
hyderabadestate.co.in
18 శనివారం జూలై 2026

# ఎన్యూమరేషన్ ఫారంలో ఓటు వివరాలు నమోదు చేసిన మంచిరెడ్డి కిషన్ రెడ్డి



హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి జూలై 17:- ప్రత్యేక ఓటరు సవరణ కార్యక్రమం (ఎస్ఐఆర్)లో భాగంగా రంగారెడ్డి జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు మంచిరెడ్డి కిషన్ రెడ్డి తన స్వగ్రామమైన ఎలిమినేడులో ఓటరు వివరాలను ఎన్యూమరేషన్ ఫారంలో నమోదు చేశారు. అనంతరం పూర్తిచేసిన ఫారాన్ని సంబంధిత ఎన్నికల అధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక ఓటరు సవరణ కార్యక్రమాన్ని అర్హులైన ప్రతి ఓటరు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఓటరు జాబితాలో పేరు నమోదు, సవరణలు, చిరునామా మార్పులు, ఇతర వివరాల సరిదిద్దుకునేందుకు ఈ కార్యక్రమం మంచి అవకాశమని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరూ గడువులోపు ఎన్యూమరేషన్ ఫారాలను నింపి సంబంధిత బీఎల్‌వోలు లేదా ఎన్నికల అధికారులకు అందజేయాలని కోరారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, ప్రతి పౌరుడు తన ఓటరు వివరాలు సక్రమంగా నమోదు అయ్యేలా బాధ్యతతో వ్యవహరించాలని మంచిరెడ్డి కిషన్ రెడ్డి పిలుపునిచ్చారు. ఎన్నికల సంఘం సూచించిన నిబంధనలను పాటిస్తూ ప్రజలు ఈ కార్యక్రమంలో చురుకుగా పాల్గొనాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## మహేశ్వరం మండలంలో రెండో రోజు ఎస్ఐఆర్ ప్రక్రియను పరిశీలించిన బీజేపీ రాష్ట్ర నాయకురాలు శ్రీదేవి.



( హైదరాబాద్ ఎస్టేట్ రంగారెడ్డి ప్రతినిధి కృష్ణ చారి జులై 17:)
మహేశ్వరం మండలంలో కొనసాగుతున్న ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ( సార్ -2026) కార్యక్రమాన్ని రెండో రోజు కూడా బీజేపీ రాష్ట్ర నాయకురాలు శ్రీదేవి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా మహేశ్వరం మండలంలోని ఆకన్ పల్లి మరియు దుబ్బచర్ల గ్రామలాలో పోలింగ్ కేంద్రాలను సందర్శించి, సంబంధిత అధికారులు, బూత్ లెవల్ అధికారులు ( బి ఎల్ ఓ లు), బీజేపీ నాయకులు, కార్యకర్తలతో సమావేశమై సార్ ప్రక్రియ అమలు తీరును సమీక్షించారు. ఓటరు నమోదు, సవరణలు, తొలగింపులు ఎన్నికల సంఘం నిబంధనల మేరకు పారదర్శకంగా జరుగుతున్నాయా అనే అంశాలను పరిశీలించి, ప్రతి అర్హుడైన ఓటరు పేరు జాబితాలో ఉండేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జాతీయ నాయకులు పాపయ్య గౌడ్ , జిల్లా నాయకులు సుదర్శన్ రెడ్డి , కాసాని వెంకటేష్ , మండల అధ్యక్షులు యదేశ్ , మండల ప్రధాన కార్యదర్శి ఉపేందర్ మండల నాయకులు దాడువై శ్రీశైలం పాల్గొన్నారు"ప్రజాస్వామ్యానికి ఓటే పునాది. ప్రతి అర్హుడి పేరు ఓటరు జాబితాలో ఉండేలా అందరూ బాధ్యతగా సహకరించాలి" అని శ్రీదేవి పిలుపునిచ్చారు.మోతే యాదయ్యబీజేపీ మహేశ్వరం మండల మీడియా కన్వీనర్

## ఔషధ మొక్కలను పెంచి = ఒక ఆదర్శ క్షేత్రంగా ఆవేర్ భగవతీపురం ఆయుర్వేదం ఆస్పటల్



( హైదరాబాద్ ఎస్టేట్ రంగారెడ్డి ప్రతినిధి కృష్ణచారి జులై 17:)
17-7-2026న అవేర్ భగవతిపురంలో మరో చారిత్రాత్మక సంఘటన జరిగింది. 10 ఎకరాల శ్రీ మాధవన్జీ ధన్వంతరి ఔషధ వనం ప్రారంభించబడింది. ఇక్కడ ఔషధ మొక్కలను పెంచుతారు. సుమారు 27 రకాల ఔషధ మొక్కలను పండిస్తారని అంచనా. ఈ ప్రాజెక్టుకు (ఐసీఎంఆర్ )భాగస్వామిగా ఉంది. ఢిల్లీ నుండి నలుగురు శాస్త్రవేత్తలు ఈ ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు. వారిలో సీనియర్ సైంటిఫిక్ ఆఫీసర్ డాక్టర్ జనేష్, డాక్టర్ దుర్గా ప్రసాద్, వృక్ష శాస్త్రవేత్త డాక్టర్ రంజిత్ ఉన్నారు. రాబోయే 6 నెలల పాటు ఔషధ మొక్కలను పెంచి, దీనిని ఒక ఆదర్శ క్షేత్రంగా తీర్చిదిద్దుతారు. ఆరు నెలల తర్వాత, శాస్త్రవేత్తలు ఆచరణాత్మక అనుభవం కోసం శిక్షణ పొందుతారు. ఈ విధంగా భగవతిపురం ఔషధ మొక్కల పరిజ్ఞానానికి కేంద్రంగా మారి, ఆయుర్వేద ఆసుపత్రులకు ఔషధ మొక్కలను సరఫరా చేస్తుంది. ఇకపై కేరళకు వెళ్లవలసిన అవసరం లేదు. అంటూ తెలియడం జరిగింది

## ఏఈ సందీప్ కుమార్‌కు ఘన సన్మానం




గీసుగొండ, జులై 17 హైదరాబాద్ ఎస్టేట్: గీసుగొండ మండల పరిధిలోని మచ్చాపూర్ విద్యుత్ సెక్షన్‌లో పదోన్నతి పొంది అసిస్టెంట్ ఇంజినీర్ (ఏఈ)గా బాధ్యతలు చేపట్టిన ఆర్. సందీప్ కుమార్‌ను యువ నాయకుడు దౌడు అజయ్ మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా దౌడు అజయ్ మాట్లాడుతూ, హనుమకొండలో సబ్ ఇంజినీర్‌గా విధులు నిర్వహించిన సందీప్ కుమార్ సమర్థత, సేవాభావంతో ప్రజల మన్ననలు పొందారని అన్నారు. పదోన్నతి పొంది మచ్చాపూర్ సెక్షన్ ఏఈగా బాధ్యతలు చేపట్టడం అభినందనీయమని పేర్కొన్నారు. ప్రజలకు, రైతులకు నాణ్యమైన విద్యుత్ సేవలు అందించడంతో పాటు, విద్యుత్ సంబంధిత సమస్యలను సత్వరమే పరిష్కరిస్తూ వినియోగదారుల విశ్వాసాన్ని చూరగొని శాఖకు మరింత మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. అనంతరం ఆర్. సందీప్ కుమార్‌కు పుష్పగుచ్ఛం అందజేసి మరోసారి అభినందనలు తెలియజేశారు.

# విల్లాల నిర్మాణం కోసం తాటి చెట్ల తొలగింపు..?

## గీత కార్మికుల ఆందోళన





హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి జూలై 17:-
రంగారెడ్డి జిల్లా: కొంగరకలాన్ గ్రామంలో విల్లాల నిర్మాణం కోసం తాటి చెట్లను తొలగించారనే ఆరోపణలు స్థానికంగా చర్చనీయాంశంగా మారాయి. గ్రామంలోని గీత కార్మికుల జీవనాధారంగా ఉన్న 150కు పైగా తాటి చెట్లను ఏఆర్‌కే డెవలప్‌మెంట్ సంస్థ విల్లాల నిర్మాణ పనుల కోసం ముందస్తు సమాచారం లేకుండా రాత్రికి రాత్రే తొలగించిందని గౌడ్ సంఘం సభ్యులు ఆరోపించారు.
తరతరాలుగా తాటి చెట్లపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్న తమ కుటుంబాలకు ఈ చర్య తీవ్ర నష్టం కలిగించిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. అభివృద్ధి పనులు చేపట్టడం తప్పు కాదని, అయితే స్థానికుల జీవనాధారాన్ని దెబ్బతీసే విధంగా వ్యవహరించడం సమంజసం కాదని పేర్కొన్నారు. తాటి చెట్లు తొలగిపోవడంతో గీత వృత్తిపై ఆధారపడిన అనేక కుటుంబాలు ఉపాధిని కోల్పోయే పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. ఈ వ్యవహారంపై ప్రభుత్వం, అటవీ శాఖ, రెవెన్యూ అధికారులు వెంటనే విచారణ జరిపి వాస్తవాలను వెలికితీయాలని, నష్టపోయిన గీత కార్మికులకు తగిన న్యాయం చేయాలని గ్రామస్థులు డిమాండ్ చేశారు. బాధిత కుటుంబాలకు పరిహారం అందించడంతో పాటు ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. ఈ ఘటనపై అధికారులు స్పందించకపోతే గ్రామంలోని గౌడ్ బాంధవులతో కలిసి పెద్దఎత్తున ఆందోళనలు చేపడతామని సంఘం ప్రతినిధులు హెచ్చరించారు. అభివృద్ధి పేరుతో సంప్రదాయ వృత్తులు, జీవనాధారాలను నాశనం చేయడం సరైన విధానం కాదని వారు అభిప్రాయపడ్డారు. అధికారులు తక్షణమే జోక్యం చేసుకుని సమస్యను పరిష్కరించాలని గ్రామ ప్రజలు విజ్ఞప్తి చేశారు.

# కాంగ్రెస్ కమిటీకి నియామక పత్రాలు అందజేసిన రంగారెడ్డి



హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి జులై 17:-
రంగారెడ్డి జిల్లా: యాచారం మండలంలోని మాల్ గ్రామ కాంగ్రెస్ కమిటీ నూతన ఎన్నికైన వారికి ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి నియామక పత్రాలను అందజేశారు. యాచారం మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మోటె శ్రీశైలం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో దొంతమోని శ్రీకాంత్ గౌడ్‌ను గ్రామ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా, పాక భాస్కర్ యాదవ్‌ను ఉపాధ్యక్షుడిగా, దేరంగుల రమేష్‌ను యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా నియమించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామ స్థాయిలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయడానికి నాయకులు, కార్యకర్తలు సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఉచిత విద్యుత్, గ్యాస్ సబ్సిడీ వంటి సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికి చేరేలా విస్తృత ప్రచారం నిర్వహించాలని సూచించారు. రెండో విడతలో అర్హులైన ప్రతి కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు, రేషన్ కార్డులు అందించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసే నాయకులు, కార్యకర్తలకు తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. గ్రామంలోని పేద, కుటుంబాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా కృషి చేయడంతో పాటు కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి అహర్నిశలు శ్రమించాలని నూతన కమిటీ సభ్యులకు సూచించారు. నియామక పత్రం అందుకున్న గ్రామ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు దొంతమోని శ్రీకాంత్ గౌడ్ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డికి కృతజ్ఞతలు తెలియజేస్తూ, పార్టీ అభివృద్ధి కోసం నిబద్ధతతో పనిచేస్తామని పేర్కొన్నారు.

# సొంత గ్రామంలో ఉచిత వైద్య శిబిరం.. రేపు భారత్ గార్డెన్‌లో మెగా మెడికల్ క్యాంప్

## ప్రజల ఆరోగ్యమే లక్ష్యంగా బుడిదె రామ్‌రెడ్డి సేవా కార్యక్రమాలు




హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి జులై 17:-
ఇబ్రహీంపట్నం మండలంలోని తన సొంత గ్రామంలో బీఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ బుడిదె రామ్‌రెడ్డి శుక్రవారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించి గ్రామ ప్రజలకు ఆరోగ్య సేవలు అందించారు. ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న ప్రతి ఒక్కరికి నిపుణులైన వైద్యులచే ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన మందులను పంపిణీ చేశారు. సాధారణ వైద్య సేవలతో పాటు స్త్రీల ఆరోగ్యం, పిల్లల వైద్యం, ఆర్థోపెడిక్, నేత్ర వైద్యం, న్యూరాలజీ, రక్తపరీక్షలు తదితర సేవలను అందించారు. ఈ సందర్భంగా బుడిదె రామ్‌రెడ్డి మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు చేరువ చేయడమే బీఆర్ఆర్ ఫౌండేషన్ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఆర్థిక ఇబ్బందులతో వైద్యం చేయించుకోలేని వారికి ఇలాంటి సేవా కార్యక్రమాలు నిరంతరం కొనసాగిస్తామని చెప్పారు. అలాగే, రేపు (శనివారం) ఇబ్రహీంపట్నంలోని భారత్ గార్డెన్స్‌లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు బీఆర్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. పయనీర్ హాస్పిటల్స్, రక్షకేర్ హాస్పిటల్, సాధురామ్ ఐ హాస్పిటల్స్ వైద్య నిపుణుల సహకారంతో నిర్వహించే ఈ శిబిరంలో సాధారణ, స్త్రీల, పిల్లల, ఆర్థోపెడిక్, నేత్ర, న్యూరాలజీ వైద్య సేవలతో పాటు అవసరమైన పరీక్షలు, మందులు పూర్తిగా ఉచితంగా అందజేయనున్నట్లు తెలిపారు. ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని బుడిదె రామ్‌రెడ్డి కోరారు.

# పార్లమెంట్‌లో బీసీ బిల్లు ప్రవేశపెట్టాలి

## - ఓబీసీలకు ప్రత్యేక కేంద్ర మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలి
## - జాతీయ బీసీ దళ్ జాతీయ అధ్యక్షుడు దుండ్ర కుమారస్వామి



హైదరాబాద్, జూలై 17: సామాజిక న్యాయం బీసీ బిల్లుతోనే సాధ్యమని జాతీయ బీసీ దళ్ జాతీయ అధ్యక్షుడు, బీసీ రిజర్వేషన్ల సాధన సమన్వయ జేఏసీ చైర్మన్ దుండ్ర కుమారస్వామి అన్నారు. ఈ నెల 20 నుంచి ప్రారంభం కానున్న పార్లమెంట్ సమావేశాలు దేశంలో సామాజిక న్యాయానికి కొత్త దిశానిర్దేశం చేసే వేదిక కావాలని, ఈ సమావేశాల్లో బీసీల హక్కులు, సంక్షేమం, సమాన అవకాశాల పరిరక్షణకు ఉద్దేశించిన బీసీ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టి ఆమోదించాలని, అలాగే దేశవ్యాప్తంగా ఓబీసీల అభ్యున్నతి కోసం ప్రత్యేక కేంద్ర మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని కాచిగూడలో గల జాతీయ బీసీ దళ్ ప్రధాన కార్యాలయంలో సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు రక్షణ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయస్థాయి సెమినార్‌లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో యాదవ హక్కుల రక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు మందకాల మణి యాదవ్తో పాటు వివిధ బీసీ, కుల సంఘాల నాయకులు, సామాజిక కార్యకర్తలు పాల్గొన్నారు. దుండ్ర కుమారస్వామి మాట్లాడుతూ, దేశ నిర్మాణంలో బీసీల పాత్ర కీలకమైనప్పటికీ వారి సామాజిక, ఆర్థిక, విద్యా అభివృద్ధికి అనుగుణమైన విధానాలు ఇంకా పూర్తిస్థాయిలో అమలులోకి రాలేదన్నారు. బీసీల వాస్తవ పరిస్థితులను అంచనా వేయాలంటే జనాభా గణనలో ప్రత్యేక ఓబీసీ కాలమ్‌ను చేర్చి సమగ్ర కులగణన నిర్వహించడం అత్యవసరమని పేర్కొన్నారు. ఖచ్చితమైన గణాంకాల ఆధారంగానే అభివృద్ధి ప్రణాళికలు, సంక్షేమ కార్యక్రమాలు, నిధుల కేటాయింపులు సమర్థవంతంగా అమలు చేయవచ్చని వివరించారు. సామాజిక న్యాయం అనేది కేవలం నినాదం కాదని, అది రాజ్యాంగం నిర్దేశించిన బాధ్యత అని ఆయన అన్నారు. బీసీలకు సంబంధించిన అంశాలను సమన్వయంతో పర్యవేక్షించి, విద్య, ఉపాధి, నైపుణ్యాభివృద్ధి, సంక్షేమ పథకాల అమలును వేగవంతం చేయడానికి ఓబీసీల కోసం ప్రత్యేక కేంద్ర మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయడం కాలానుగుణ అవసరమని అభిప్రాయపడ్డారు. అలాంటి వ్యవస్థ ఏర్పడితే బీసీల అభివృద్ధికి దీర్ఘకాలిక విధానాలు రూపొందించే అవకాశం ఉంటుందని చెప్పారు. రానున్న పార్లమెంట్ సమావేశాలు దేశ ప్రజల ఆకాంక్షలను ప్రతిబింబించే వేదికగా నిలవాలని, బీసీ బిల్లు, ఓబీసీ జనగణన, ప్రత్యేక కేంద్ర మంత్రిత్వ శాఖ ఏర్పాటు వంటి అంశాలను ప్రాధాన్యంగా చర్చించి చట్టబద్ధ నిర్ణయాలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. దేశవ్యాప్తంగా ఉన్న బీసీ సంఘాలు, కుల సంఘాలు, ప్రజాసంఘాలు సామాజిక న్యాయం సాధనే లక్ష్యంగా ఐక్యంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. సెమినార్‌లో పాల్గొన్న వివిధ బీసీ సంఘాల ప్రతినిధులు మాట్లాడుతూ, బీసీల సమగ్ర అభివృద్ధికి డేటా ఆధారిత విధానాలు, రాజ్యాంగబద్ధ రక్షణలు, బలమైన సంస్థాగత వ్యవస్థ అవసరమని అభిప్రాయపడ్డారు. పార్లమెంట్ సమావేశాల్లో బీసీలకు సంబంధించిన కీలక అంశాలపై కేంద్ర ప్రభుత్వం సానుకూల నిర్ణయాలు తీసుకోవాలని ఏకగ్రీవంగా తీర్మానించారు.

RNI No Tel / 2012 /4241
ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..
హైద్రాబాద్ ఎస్టేట్
తెలుగు దిన పత్రిక
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
hyderabadestate.co.in
18 శనివారం జూలై 2026

# ఉచిత శిక్షణ.. ఉపాధికల్పన

## మహిళలకు కుట్టు, ఫ్యాషన్ డిజైనింగ్ లో తర్ఫీదు

## హిందూ స్మశాన వాటిక ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహణ

హైదరాబాద్, మహానది న్యూస్,జూలై 17: మహిళలు కేవలం వంటింటికే పరిమితం కాకుండా ఆర్థికంగా ఎదిగి సాధికారత దిశగా అడుగులు వేస్తున్నారు. స్వయం ఉపాధి పొందేందుకు కృషి చేస్తున్నారు. ఇందు కోసం కాచిగూడ హరాస్ పెంట లో మహిళలకు ఉపాధి పథకాల్లో శిక్షణ ఇచ్చి ప్రోత్సాహం అందిస్తున్నదనడంలో సందేహం లేదు.





శ్రీప్రసన్నాంజనేయ స్వామి ప్రాంగణంలో..

కాచిగూడ, హరాస్ పెంట లోని హిందూ స్మశాన వాటిక ట్రస్ట్ ఆధ్వర్యంలో శ్రీ ప్రసన్నాంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలోని హాల్లో శిక్షణా కేంద్రం ఏర్పాటు చేశారు. మహిళలకు కుట్టు, మగ్గం, ఎంబ్రాయిడరీ, బ్యూటీషియన్ తదితరాల వాటిల్లో మహిళలకు ఉచిత శిక్షణ ఇస్తున్నారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు బ్యాచ్ ల వారీగా శిక్షణ ఇస్తున్నారు. 3 నెలల పాటు శిక్షన ఇచ్చి సర్టిఫికెట్లను అందజేస్తామని ట్రస్ట్ అధ్యక్షుడు రాజేందర్ పటేల్ గౌడ్ తెలిపారు. యువతులతో పాటు గృహిణులు శిక్షణ పొందుతున్నారని తెలిపారు.

ఆధునిక శిక్షణ తరగతులు

హిందూ స్మశాన వాటిక ట్రస్ట్ ఆధ్వర్యంలో మహిళలకు టైలరింగ్, ఎంబ్రాయిడరీ, మగ్గం, బ్యూటీషియన్లలో ఉచితంగా శిక్షణ ఇస్తూ వారిని స్వయం ఉపాధి వైపు బాటలు వేయిస్తోంది. కాచిగూడ, నింబోలిఅడ్డలో అధిక శాతం సాధారణ మధ్యతరగతి కుటుంబాలకు చెందిన వారే అధికంగా ఉన్నారు. వీరే వివిధ ప్రాంతాల నుంచి వలస వచ్చి అద్దె ఇళ్ళు, అతి కొద్దిమంది సొంత నివాసాల్లో ఉంటున్నారు. ప్రతి కుటుంబంలో సంపాదించే వారు మగవారే కావడంతో గృహిణిలు ఇంటి పనికే పరిమితమవుతున్నారు. ఇలాంటి వారికి ప్రతి బ్యాచ్లో 40 మందికి ఉచిత శిక్షణ ఇస్తున్నారు. మహిళా సాధికారతతో పాటు సామాజిక సేవా కార్యక్రమాల్లోనూ హిందూ స్మశానవాటిక ప్రశంసలందుకొంటోంది.

సామాజిక సేవల్లో..

మహిళలకు ఉచిత కుటు శిక్షణ, మెహిందీ, ఫ్యాషన్, బ్యూటీషియన్, మగ్గం, ఎంబ్రాయిడరీ తదితర విభాగాల్లో శిక్షణతో పాటు ఉచితంగా పేద ప్రజల కోసం క్లినిక్కు నడుపుతున్నాం. జనరల్ వైద్యంతో పాటు ఫిజియోథెరఫీ, హోమియోపతి, తదితర ఉచిత వైద్య సేవలను అందిస్తున్నాం. వివిధ సూపర్స్పెషాలిటీ ఆసుపత్రుల సహకారంతో ఉచిత వైద్య శిభిరాలను నిర్వహిస్తూ పేదలకు ఉచిత వైద్య ఆరోగ్య సేవలను అందుబాటులోకి తెచ్చాం. త్వరలో న్యాయ సలహా కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు అవసరమైన చర్యలు చేపడుతున్నాం.

రాజేందర్ పటేల్ గౌడ్, అధ్యక్షుడు హిందూ స్మశాన వాటిక

మహిళలు ఆత్మగౌరవంతో బతకడానికి శిక్షణ దోహదం మహిళలు ఆత్మగౌరవంతో బతకడానికి ఈ శిక్షణ ఎంతగానో దోహదం చేస్తుంది. ఇప్పటికే వందలాది మంది మహిళలు ఇక్కడ శిక్షణ తీసుకున్నారు. శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్స్ను అందించడంతో పాటు ఉపాధి వైపు పయనించేలా తగిన ప్రోత్సాహాన్ని కల్పిస్తున్నాం.

– మొగిళ్ల లలిత, శిక్షకురాలు

# రామకృష్ణాపురం, అల్కాపురి నూతన పాలకవర్గాలకు దేప భాస్కర్ రెడ్డి అభినందనలు



( హైదరాబాద్ ఎస్టేట్ రంగారెడ్డి ప్రతినిధి కృష్ణ చారి జూలై 17:)
మహేశ్వరం నియోజకవర్గం రామకృష్ణాపురం డివిజన్ పరిధిలో ఇటీవల జరిగిన ఐటీడీఎస్ కో–ఆపరేటివ్ హౌసింగ్ బిల్డింగ్ సొసైటీ (శ్రీ రామకృష్ణాపురం),అల్కాపురి కాలనీ ఎన్నికల్లో ఘన విజయం సాధించిన నూతన పాలకవర్గ సభ్యులు మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు,టీపీసీసీ సభ్యులు దేప భాస్కర్ రెడ్డిని వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన అధ్యక్షులు, ఉపాధ్యక్షులు,పాలకవర్గ సభ్యులకు దేప భాస్కర్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు.రామకృష్ణాపురం ఐటీడీఎస్ సొసైటీ అధ్యక్షులుగా బి.వెంకటేశ్వర్లు,ఉపాధ్యక్షులుగా రామస్వామి,అల్కాపురి కాలనీ అధ్యక్షులుగా శ్రీమన్నారాయణ, ఉపాధ్యక్షులుగా వీరేందర్ ఎన్నికైన విషయం తెలిసిందే.ఈ సందర్భంగా దేప భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ,రామకృష్ణాపురం ఐటీడీఎస్ సొసైటీ, అల్కాపురి కాలనీల సమగ్ర అభివృద్ధికి నూతన పాలకవర్గాలు సమన్వయంతో పనిచేసి ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకోవాలని ఆకాంక్షించారు.కాలనీల్లో మౌలిక వసతుల కల్పన,ప్రజా సమస్యల పరిష్కారంలో తమ పూర్తి సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ చిలుక ఉపేందర్ రెడ్డి,రామకృష్ణాపురం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పూన్న గణేష్ నేత,ముప్పిడి లింగస్వామి గౌడ్,బొడ్డుపల్లి మహేందర్,జ్ఞానేశ్వర్ యాదవ్,భగత్,పాలకవర్గ కార్యదర్శి రామారావు,కోశాధికారి నరసింహారావు,సభ్యులు వెంకటరమణ,అన్నపూర్ణమ్మ,సత్యనారాయణ,సైదారావు,కృష్ణయ్య,శేషగిరిరావు,భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# కుటుంబ సంక్షేమంపై అవగాహన, విశిష్ట సేవలందించిన ఆరోగ్య సిబ్బందికి సత్కారం




హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి జూలై 17:-
రంగారెడ్డి: ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకుని రంగారెడ్డి జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో శివరాంపల్లిలోని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ కార్యాలయ కాన్ఫరెన్స్ హాల్లో కుటుంబ సంక్షేమ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా అదనపు కలెక్టర్ డాక్టర్ కిరణ్ మయి ముఖ్య అతిథిగా హాజరుకాగా, జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ స్వర్ణ కుమారి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ కిరణ్ మయి మాట్లాడుతూ కుటుంబ నియంత్రణ, తల్లి–శిశు ఆరోగ్యం, మహిళల సంక్షేమంపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించడం అత్యవసరమని పేర్కొన్నారు. ప్రసవాల మధ్య తగిన విరామం పాటించడం, ప్రభుత్వ కుటుంబ నియంత్రణ సేవలను వినియోగించుకోవడం ద్వారా కుటుంబ ఆరోగ్యం, ఆర్థిక స్థిరత్వం మెరుగుపడుతాయని తెలిపారు. ప్రతి ఇంటికీ చేరుకుని ప్రజలకు అవగాహన కల్పించడంలో ఆరోగ్య కార్యకర్తలు కీలక పాత్ర పోషించాలని సూచించారు.డాక్టర్ స్వర్ణ కుమారి మాట్లాడుతూ వైద్యాధికారులు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తల సేవలు కుటుంబ సంక్షేమ కార్యక్రమాల విజయానికి బలమని అన్నారు. గర్భిణుల నమోదు, తల్లి–శిశు సంరక్షణ, కుటుంబ నియంత్రణ సేవలను సమర్థంగా అమలు చేయడం ద్వారా ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని తెలిపారు.అనంతరం కుటుంబ సంక్షేమ కార్యక్రమాల్లో విశేష కృషి చేసిన వైద్యాధికారులు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలకు జిల్లా అదనపు కలెక్టర్ ప్రశంసా పత్రాలు, అవార్డులు అందజేసి సత్కరించారు. ఈ గుర్తింపు తమకు మరింత బాధ్యతను పెంచిందని అవార్డు గ్రహీతలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కార్యక్రమాధికారులు, వైద్య సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు. అధికారులు చిన్న కుటుంబంఆరోగ్యకరమైన కుటుంబం అనే సందేశాన్ని ప్రతి ఇంటికీ చేర్చాలని పిలుపునిచ్చారు.

# నాగారం భూ సమస్యలపై అధికారులతో చర్చ సమస్యలు లేని నియోజకవర్గంగా మహేశ్వరం కేఎల్ఆర్

## సీసీ రోడ్లు వేయించాలని అల్మాస్ గూడ, మీర్ పేట నాయకుల వినతి

( హైదరాబాద్ ఎస్టేట్ రంగారెడ్డి ప్రతినిధి కృష్ణ చా రి జులై 17:)
జిహెచ్ఎంసిలో విలీనమైన శివారు మున్సిపాలిటీల్లోని కాలనీలు, పల్లెల సమస్యలను తీర్చేందుకు ప్రజా ప్రభుత్వం సిద్దంగా ఉందని మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి అన్నారు. తుక్కుగూడ కార్యాలయంలో కె ఎల్ ఆర్ తో డాక్టర్ కాలనీకి చెందిన కాంగ్రెస్ నాయకులు చెన్ రెడ్డి సురేష్ రెడ్డి భేటీ అయ్యారు. సరూర్ నగర్, డాక్టర్ కాలనీ డివిజన్లలో డ్రైనేజీ, సీసీ కెమెరాలు, తాగునీటి సమస్యలు, రోడ్ల మరమ్మత్తులు చేయించాలని కోరారు. భగత్ సింగ్ నగర్, అంబేద్కర్ నగర్ సహా పలువురు పేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు వచ్చేలా చూడాలని కిచ్చెన్నకి విజ్ఞప్తి చేశారు.మీర్ పేట, జిల్లెలగూడ, ప్రశాంతిహిల్స్ కాలనీల్లో సీసీ రోడ్లు లేక కాలనీవాసులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని కాంగ్రెస్ సీనియర్ నాయకులు సామిడి గోపాల్ రెడ్డి... కే ఎల్ ఆర్ దృష్టికి తెచ్చారు.
అల్మాస్ గూడ కాలనీల్లో నెలకొన్న సమస్యలపై పలు కాలనీ అధ్యక్షులు, కమిటీ సభ్యులతో కలిసి హస్తం పార్టీ నేత నవారు మల్లారెడ్డి... కిచ్చెన్నని కలిసి వినతి పత్రాలు అందజేశారు. దశాబ్దాలుగా నివాసం ఉంటున్నా... కాలనీల్లో సీసీరోడ్లు, డ్రైనేజీలను గత పాలకులు పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు.మహేశ్వరం



నియోజకవర్గంలో ఉన్న కాలనీల్లోని సమస్యలు తీర్చేందుకు అధికార యంత్రాంగం క్షేత్రస్థాయిలో పర్యటించాలని లక్ష్మారెడ్డి కోరారు. ప్రభుత్వం నుంచి నిధులు తెచ్చి సమస్యలు లేని కాలనీలుగా తీర్చేందుకు కృషి చేస్తానని కేఎల్ఆర్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు, టీపీసీసీ మెంబర్ దేప భాస్కర్ రెడ్డి సహా పలువురు నేతలు పాల్గొన్నారు.

# సీజనల్ వ్యాధుల నియంత్రణపై ప్రత్యేక దృష్టి: కలెక్టర్ సి. నారాయణ రెడ్డి

హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి జూలై 17:-
రంగారెడ్డి జిల్లా: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు ప్రక్రియను వేగవంతం చేయడంతో పాటు తాగునీటి సమస్యలు, సీజనల్ వ్యాధుల నియంత్రణపై అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి అధికారులను ఆదేశించారు. శుక్రవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం నుంచి జిల్లా అధికారులు, మున్సిపల్ కమిషనర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్లో కలెక్టర్ పలు అభివృద్ధి, ప్రజారోగ్య అంశాలపై సమీక్ష నిర్వహించారు. 202627 విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రభుత్వ, స్థానిక సంస్థల పాఠశాలలు, ప్రీ–ప్రైమరీ పాఠశాలలు, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలు, తెలంగాణ మోడల్ స్కూళ్లలో విద్యార్థుల నమోదును మరింత వేగవంతం చేయాలని సూచించారు. అలాగే నిర్మాణంలో ఉన్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్ల పనులను నిర్దేశిత గడువులో పూర్తి చేసేలా నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారు.
ఎల్నినో ప్రభావంతో వర్షపాతం తగ్గే అవకాశం ఉన్న నేపథ్యంలో గ్రామాలు, పట్టణాల్లో తాగునీటి సరఫరాకు ఎలాంటి అంతరాయం కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. డెంగ్యూ, చికున్గున్యా, మలేరియా, టైఫాయిడ్ వంటి సీజనల్ వ్యాధుల నివారణకు ప్రత్యేక కార్యాచరణ అమలు చేయడంతో పాటు ఆసుపత్రుల్లో మందులు, పరీక్షా కిట్లు, వైద్య సిబ్బంది, అంబులెన్స్ సేవలు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా చూడాలని ఆదేశించారు. వానాకాల వ్యవసాయ సీజన్ను



దృష్టిలో ఉంచుకుని రైతులకు విత్తనాలు, ఎరువులు సకాలంలో అందించడంతో పాటు ప్రత్యామ్నాయ పంటల సాగుపై అవగాహన కల్పించి రైతు నమోదు ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. వీడియో కాన్ఫరెన్స్లో అదనపు కలెక్టర్ కె. కిరణ్మయి, ఆర్డీఓలు, మున్సిపల్ కమిషనర్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ యువ సంగ్రామ సదస్సుకు యువత భారీగా తరలిరావాలి

## : మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్ రెడ్డి

## నిరుద్యోగ యువత హక్కుల కోసం యువ సంగ్రామ సదస్సు

## : బీఆర్ఎస్ పిలుపు




హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి జులై 17:-
రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు హామీలు, "యూత్ డిక్లరేషన్"లో చేసిన వాగ్దానాలను అమలు చేయకుండా యువత, విద్యార్థులు, నిరుద్యోగులను మోసం చేసిందని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్ రెడ్డి విమర్శించారు. ఈ నేపథ్యంలో జూలై 18న ఉదయం 10 గంటలకు హైదరాబాద్లోని సరూర్నగర్ ఇండోర్ స్టేడియంలో నిర్వహించనున్న బీఆర్ఎస్ యువ సంగ్రామ సదస్సును విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. రాష్ట్రం నలుమూలల నుంచి నిరుద్యోగ యువత, విద్యార్థులు, పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ హక్కుల సాధన కోసం ఐక్యంగా గొంతెత్తాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం యువతకు ఇచ్చిన హామీల అమలుపై సమాధానం చెప్పాలని ఈ సదస్సు ద్వారా డిమాండ్ చేయనున్నట్లు తెలిపారు. యువత తమ భవిష్యత్తు కోసం జరిగే ఈ కార్యక్రమంలో చురుకుగా పాల్గొని సదస్సును విజయవంతం చేయాలని మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.

# యాదగిరిగుట్టలో అర్చకుడిగా శ్రీహర్ష

## ఊకల్ నాగేంద్రస్వామి ఆలయ ప్రధాన అర్చకుల కుమారుడికి అరుదైన అవకాశం

గీసుగొండ, జులై 17 హైదరాబాద్ ఎస్టేట్:
గీసుగొండ మండలం ఊకల్ గ్రామానికి చెందిన సముద్రాల శ్రీహర్ష శరవణ కుమార్ యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో పరిచారక అర్చకుడిగా నియమితులయ్యారు. ఊకల్ నాగేంద్రస్వామి దేవాలయ ప్రధాన అర్చకులు శ్రీమాన్ సముద్రాల సుదర్శన్ ఆచార్యుల కుమారుడైన శ్రీహర్షకు ఈ అవకాశం లభించడం పట్ల గ్రామస్థులు, భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. హైదరాబాద్లోని రవీంద్రభారతిలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో దేవాదాయ శాఖ కమిషనర్తో పాటు పలువురు ఉన్నతాధికారుల చేతుల మీదుగా శ్రీహర్ష శరవణ కుమార్ నియామక పత్రాన్ని అందుకున్నారు. యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో పరిచారక అర్చకుడిగా సేవలందించే అవకాశం రావడం పట్ల కుటుంబ సభ్యులు, వేద పండితులు, అర్చకులు, గ్రామ పెద్దలు శ్రీహర్షకు శుభాకాంక్షలు తెలిపారు.




స్వామివారి సేవలో భక్తిశ్రద్ధలతో విధులు నిర్వహిస్తూ భక్తులకు మెరుగైన సేవలు అందించాలని ఆకాంక్షించారు.

RNI No Tel / 2012 /4241
హైదరాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
తెలుగు దిన పత్రిక
hyderabadestate.co.in

18 శనివారం జూలై 2026

## నీట్-2026 ఫలితాల్లో మరోసారి అగ్రగామిగా రెసో మెడికాన్ విద్యార్థుల అద్భుత ప్రతిభ





హనుమకొండ జూలై 17 హైదరాబాద్ ఎస్టేట్ నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్ (NEET)-2026 ఫలితాల్లో హనుమకొండలోని రెసో మెడికాన్ జూనియర్ కళాశాల విద్యార్థులు మరోసారి విశేష ప్రతిభ కనబరిచారు. ఈ సందర్భంగా కళాశాల ఛైర్మన్ లెక్కల రాజిరెడ్డి హర్షం వ్యక్తం చేస్తూ, ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ ఏడాది కూడా సంస్థ విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించి ఫ్రీ మెడికల్ సీట్లకు అర్హత సాధించే స్థాయిలో మార్కులు పొందారని తెలిపారు. ఈ ఏడాది నీట్ పరీక్షలో కళాశాలకు చెందిన పలువురు విద్యార్థులు విశేష మార్కులు సాధించి ప్రభుత్వ, ప్రముఖ ప్రైవేట్ మెడికల్ కళాశాలల్లో ప్రవేశాలు పొందే అవకాశాలను మెరుగుపరుస్తుందన్నారు. అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులు:శ్యాంకరన్ 655 మార్కులు,గురురాజ్ రెడ్డి 630,కోమల్ 591,అభిషేక్ 580,సాక్షి 546,మహమ్మద్ అద్నాన్ 528,మణిదీప్ 528 మార్కులు వేముల జశ్విన్ తేజ్ 500 మార్కులు సాధించారని ఈ సందర్భంగా ఛైర్మన్ లెక్కల రాజిరెడ్డి మాట్లాడుతూ..వరంగల్హనుమకొండ జిల్లాల్లోనే అత్యాధునిక వసతులతో ప్రత్యేకంగా Bi.P.C. G NEET కోచింగ్ క్యాంపస్ ఏర్పాటు చేసి,జాతీయ స్థాయి అనుభవం కలిగిన అధ్యాపకులతో నిరంతర పర్యవేక్షణలో శిక్షణ అందించడం వల్లే ప్రతి సంవత్సరం ఈ స్థాయి విజయాలు సాధ్యమవుతున్నాయని తెలిపారు. ఈ అవకాశాన్ని జిల్లాల తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.రెసో మెడికాన్ మేనేజింగ్ డైరెక్టర్ దీప్తిరావు మాట్లాడుతూ..ఈ ఏడాది మరో 56 మంది విద్యార్థులు 400కు పైగా మార్కులు సాధించి ఫ్రీ మెడికల్ సీట్లు పొందే అవకాశాలను మెరుగుపరుచుకున్నారని తెలిపారు. ఈ విజయానికి కృషి చేసిన విద్యార్థులు,అధ్యాపకులు, తల్లిదండ్రులకు సంస్థ యాజమాన్యం అభినందనలు తెలిపింది. ఈ విజయోత్సవాన్ని పురస్కరించుకొని కళాశాలలో నిర్వహించిన అభినందన సభలో మేనేజింగ్ డైరెక్టర్ దీప్తిరావు,డైరెక్టర్లు లెక్కల మహేందర్ రెడ్డి,మాదిరెడ్డి దేవేందర్ రెడ్డి,సీఈఓ లెక్కల రమ్యా రాజిరెడ్డి,ప్రిన్సిపల్, అధ్యాపకులు,ర్యాంకులు సాధించిన విద్యార్థులు,వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## నగదు రహిత వైద్యం చారిత్రాత్మక నిర్ణయం..

### ప్రభుత్వానికి జేఏసీ ఛైర్మన్ లక్ష్మారెడ్డి కృతజ్ఞతలు



హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి ఇరిగి అశోక్... ప్రభుత్వం ఉద్యోగులకు పెన్షనర్లకు ఆరోగ్య భద్రత కల్పించడం హర్షనీయమని ఉద్యోగుల జేఏసీ ఛైర్మన్ ఎంప్లాయిస్ హెల్త్ కేర్ ట్రస్ట్ మెంబర్ వి. లక్ష్మారెడ్డి అభిప్రాయపడ్డారు. నగదు రహిత వైద్య సేవలు చారిత్రాత్మక నిర్ణయం అన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఉద్యోగుల పెన్షనర్ల తరపున సీఎం రేవంత్ రెడ్డి డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క మంత్రి దామోదర్ రాజనర్సిములకు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులు పెన్షనర్లకు నాణ్యమైన. నగదు రహిత వైద్య సేవలను అందించాలనే సంకల్పంతో ఎంప్లాయ్ హెల్త్ కేర్ ట్రస్ట్ అమలుకు శ్రీకారం చుట్టడం జరిగిందని తెలిపారు. హెల్త్ స్కీమ్ పథకం రూపకల్పన అమలులో విశేష కృషి చేసిన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కి ధన్యవాదాలు తెలిపారు. ఉద్యోగులు పెన్షనర్ల ఆరోగ్య భద్రతకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంతో ఆరోగ్య భరోసా పెరుగుతుందన్నారు. ఉద్యోగుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి పని చేస్తుందన్నారు. భవిష్యత్తులో కూడా ఉద్యోగుల సంక్షేమానికి ఇదే స్ఫూర్తితో మరిన్ని సంక్షేమ కార్యక్రమాలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపిన వారిలో రాష్ట్ర అధ్యక్షులు రాజశేఖర్ టి జి టి ఏ రాష్ట్ర అధ్యక్షులు ఎస్ రాములు టి జి ఆర్ ఎస్ ఏ రాష్ట్ర అధ్యక్షులు .బాణాల రామ్ రెడ్డి. ఎస్ రాములు.రమేష్ పాక. రాధా. నిర్మల. బిక్షం. ఉపేందర్ రావులతోపాటు వివిధ ఉద్యోగ పెన్షనర్ల సంఘాల నాయకులు జేఏసీ నాయకులు ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

తలసాని ముందుగా తనపై కల్వకుంట్ల కన్నారావు చేసిన వ్యాఖ్యలకు సమాధానం చెప్పాలి.
ఆ తర్వాత ఇతర పార్టీల అంతర్గత వ్యవహారాలపై మాట్లాడితే మంచిది.
సీఎం రేవంత్ రెడ్డి మరియు పీసీసీ ప్రెసిడెంట్ మహేష్ కుమార్ గౌడ్ గార్ల ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ దూసుకెళ్తుంది.మా పార్టీ అంతర్గత వ్యవహారంతో మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ కుల రాజకీయాలు చేయడమేంటి?
గ్రేటర్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకునే తలసాని ఈ కుల రాజకీయం చేస్తున్నాడు.
బీఆర్ఎస్ హయాంలో మంత్రిగా ఉన్న తలసానిని కేసీఆర్ అన్న కుమారుడు కల్వకుంట్ల కన్నారావు నోటికొచ్చినట్లు మాట్లాడినప్పుడు నోరు మెదపని తలసాని, ఈ రోజు ఇలా వ్యవహరించడం సిగ్గుచేటు.




జగ్గారెడ్డి గారు
రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, టీపీసీసీ

## రీజినల్ ప్రాడిజీ2026లో సిప్ అబాకస్ నాగోల్ విద్యార్థుల ఘన విజయం



హైదరాబాద్ ఎస్టేట్ రంగారెడ్డి ప్రతినిధి కృష్ణ చారి జులై 17
హైదరాబాద్ జోనల్ పరిధిలోని సిప్ అబాకస్ అకాడమీ నాగోల్ బ్రాంచ్ విద్యార్థులు జూలై 12న నిర్వహించిన రీజినల్ ప్రాడిజీ2026 పోటీల్లో అద్భుత ప్రతిభ కనబరిచి పలు అవార్డులను సొంతం చేసుకున్నారు.3,300 మందికి పైగా విద్యార్థులు పాల్గొన్న ఈ పోటీల్లో నాగోల్ బ్రాంచ్‌కు చెందిన చిన్నారులు 1వ,2వ,3వ కేటగిరీల్లో విజేతలుగా నిలవడంతో పాటు పర్ఫార్మర్ అవార్డులు కూడా అందుకున్నారు.సెంటర్ హెడ్ రాధికా కుండే శిక్షణలో విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు.ఈ విజయానికి అకాడమీ సిబ్బంది ఆర్.సౌమ్య,పి.రిషిత,పి.శ్రావణి,ఎన్.వరలక్ష్మి,వి.మౌనిక,బి.శారదా దేవి,ఎం.అరుణ అందించిన శిక్షణ,సహకారం ఎంతో దోహదపడింది.విజేతలుగా నిలిచిన విద్యార్థులు:డి.మార్తా ప్రిన్సెస్,సాయి సుశాంత్,ఆర్.జశ్వంత్ సాయి కుమార్,జి.అశ్మిత్ రెడ్డి,రితిక్ బొజ్జం,డి.ప్రతీక్,ఎం.స్నేహల్ రెడ్డి,వల్లపు శ్రీవత్సవ్,పునీత్ సాయి కొల్లిపారా,బి.దివిజ్,పి.హన్విక.ఈ సందర్భంగా విజేతలను సెంటర్ హెడ్ రాధికా కుండే మాట్లాడుతూ ముందుగా తమ విద్యార్థిని విద్యార్థులను అభినందిస్తూ,భవిష్యత్తులో మరిన్ని ఉన్నత విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.అబాకస్ శిక్షణ వల్ల పిల్లలకు కలిగే ప్రయోజనాలు ఎంతో విశేషమైనవి. చిన్న వయస్సులోనే అబాకస్ నేర్చుకోవడం ద్వారా గణితంపై భయం తగ్గి, క్లిష్టమైన లెక్కలను వేగంగా చేయగల సామర్థ్యం పెరుగుతుంది. జ్ఞాపకశక్తి, ఏకాగ్రత, పరిశీలనా శక్తి, తార్కిక ఆలోచన, ఆత్మవిశ్వాసం, నిర్ణయ సామర్థ్యం వంటి నైపుణ్యాలు అభివృద్ధి చెందుతాయి. చదువులో మెరుగైన ఫలితాలు సాధించడంతో పాటు పోటీ పరీక్షలకు కూడా బలమైన పునాది ఏర్పడుతుంది. తల్లిదండ్రులకు కూడా ఈ శిక్షణ ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. పిల్లల్లో క్రమశిక్షణ, సమయపాలన, ఆలోచనా విధానం మెరుగుపడటంతో పాటు మొబైల్, టీవీలపై ఆధారపడే సమయం తగ్గి, చదువుపై ఆసక్తి పెరుగుతుంది. పిల్లల సమగ్ర మేధో వికాసానికి అబాకస్ శిక్షణ ఒక ఉత్తమ సాధనంగా విద్యా నిపుణులు పేర్కొంటున్నారు.అలాగే విద్యార్థుల విజయానికి సహకరించిన తల్లిదండ్రులు,సిబ్బందికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## షాద్‌నగర్ జోన్‌లో నేర నియంత్రణపై ప్రత్యేక దృష్టి

### : పోలీస్ కమిషనర్ డా. తరుణ్ జోషి






హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి జులై 17:-
ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని షాద్‌నగర్ జోన్‌కు సంబంధించిన క్రైమ్ రివ్యూ సమావేశాన్ని పోలీస్ కమిషనర్ డా. తరుణ్ జోషి, ఐపీఎస్ శుక్రవారం టీజీపీఏ పోలీస్ అకాడమీలో నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రేవ్ (UI), పోక్సో, ఎస్సీ/ఎస్టీ, పీడీ యాక్ట్ కేసులతో పాటు పెండింగ్ కేసుల దర్యాప్తు పురోగతిని సమీక్షించారు. పోలీసు అధికారులు ప్రతి కేసును నాణ్యతతో దర్యాప్తు చేసి, పెండింగ్ కేసులను త్వరితగతిన పూర్తి చేయాలని కమిషనర్ ఆదేశించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టడంతో పాటు ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. అలాగే సీసీటీఎన్ఎస్, ఈ-సాక్షి వ్యవస్థలను సమర్థంగా వినియోగించి దర్యాప్తు వేగవంతం చేయాలని, సైబర్ నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. ప్రజలతో స్నేహపూర్వకంగా వ్యవహరిస్తూ పోలీస్-ప్రజల అనుబంధాన్ని మరింత బలోపేతం చేయాలని అధికారులకు సూచించారు. సమావేశంలో షాద్‌నగర్ జోన్ డీసీపీ చి. సిరీష, అడిషనల్ డీసీపీ సాయిక్ జహంగీర్, ఎస్బీ ఏసీపీ హుస్సైనీ నాయుడు, షాద్‌నగర్ ఏసీపీ ఎస్. లక్ష్మీనారాయణ, ఐటీ సెల్ ఇన్‌స్పెక్టర్ బి. జేమ్స్ బాబు, సీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ బి. వీరబాబు, జోన్ పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్ల ఎస్‌హెచ్‌ఓలు పాల్గొన్నారు.

# ఆధారాలతోనే ఆరోపణలు చేయాలి..

## వాస్తవాలే ప్రజా చర్చకు ప్రమాణం

### దాడి శివ

### పీఏసీఎస్ నియామకాలపై వెలువడిన కథనానికి గీసుగొండ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడి స్పందన

### ఆధారాలు ఉంటే అధికారులకు సమర్పించి విచారణ కోరాలని సూచన



గీసుగొండ, జూలై 17 హైదరాబాద్ ఎస్టేట్:
పీఏసీఎస్ ఛైర్మన్, వైస్ ఛైర్మన్ నియామకాలపై ఇటీవల వెలువడిన కథనాల నేపథ్యంలో గీసుగొండ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దాడి శివ స్పందించారు. ప్రజా ప్రయోజనాలకు సంబంధించిన అంశాలపై ఆరోపణలు చేసే సమయంలోనూ, వార్తలు ప్రచురించే సమయంలోనూ వాస్తవాలు, ధృవీకరించిన సమాచారం, సంబంధిత పక్షాల వివరణ, విశ్వసనీయ ఆధారాలకు ప్రాధాన్యం ఇవ్వడం బాధ్యతాయుత జర్నలిజానికి మూల సూత్రమని పేర్కొన్నారు. కథనంలో చేసిన ఆరోపణలకు సంబంధించి పత్రాలు, ఆడియోలు, వీడియోలు లేదా ఇతర ఆధారాలు ఉంటే వాటిని సంబంధిత అధికారులకు సమర్పించి నిష్పాక్షిక విచారణ కోరాలని సూచించారు. నిజంగా అక్రమాలు జరిగి ఉంటే చట్టప్రకారం బాధ్యులపై చర్యలు తీసుకోవాల్సిందేనని, అయితే నిర్ధారణ లేని ఆరోపణలు, ఊహాగానాలు ప్రజల్లో అపోహలు, గందరగోళానికి దారితీసే ప్రమాదం ఉందని అన్నారు. పీఏసీఎస్ నియామకాల ప్రక్రియ సహకార శాఖ నిబంధనలు, మార్గదర్శకాల మేరకు కొనసాగుతోందని తన అవగాహనను వ్యక్తం చేసిన దాడి శివ, పార్టీ కోసం నిబద్ధతతో పనిచేసిన ప్రతి కార్యకర్తకు న్యాయం జరిగేలా కాంగ్రెస్ పార్టీ నాయకత్వం నిర్ణయాలు తీసుకుంటుందనే విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. ప్రజా ప్రయోజనాలకు సంబంధించిన అంశాల్లో సంబంధిత అన్ని పక్షాల అభిప్రాయాలు, అధికారిక సమాచారం, వాస్తవ ఆధారాలను పరిగణనలోకి తీసుకొని సమతుల్యంగా వార్తలు ప్రచురించడం వల్లే ప్రజలకు సరైన అవగాహన కలుగుతుందని ఆయన అన్నారు. ఆధారాలు ఉంటే వాటిని చట్టబద్ధంగా అధికారులకు సమర్పించి విచారణ కోరాలని, వాస్తవాలు, పారదర్శకత, బాధ్యతాయుత వ్యవహారమే ప్రజాస్వామ్య విలువలను బలోపేతం చేస్తాయని దాడి శివ పేర్కొన్నారు.

## పదోన్నతి పొందిన అధికారులకు ఘన సన్మానం





గీసుగొండ, జులై 17 హైదరాబాద్ ఎస్టేట్:
గీసుగొండ మండలంలో విధులు నిర్వహించి ఇటీవల పదోన్నతి పొందిన మాజీ ఎంపీడీఓ పాక శ్రీనివాస్, ఎంపీఓగా పదోన్నతి పొందిన ఎం.డి. షాజహాన్‌లకు మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఘన సన్మానం నిర్వహించారు. ఎంపీడీఓ వెన్న కృష్ణవేణి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మండల పరిషత్ ఉద్యోగులు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, ఈ-పంచాయతీ ఆపరేటర్లు, ఉపాధి హామీ సిబ్బంది, గ్రామ పంచాయతీ ఉద్యోగులు శాలువాలు కప్పి పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా తహసీల్దార్ ఎం.డి. రియాజుద్దీన్, ఎంపీడీఓ వెన్న కృష్ణవేణి మాట్లాడుతూ పాక శ్రీనివాస్, షాజహాన్‌లు తమ విధుల్లో అంకితభావంతో పనిచేస్తూ ప్రజలకు, స్థానిక సంస్థలకు విశేష సేవలు అందించారని కొనియాడారు. పదోన్నతితో కొత్త బాధ్యతల్లోనూ అదే నిబద్ధతతో సేవలందిస్తూ మరింత ఉన్నత స్థానాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎంపీఓ టి. శేషాంజన్ స్వామి, సూపరింటెండెంట్ కమలాకర్, టీఎన్‌జీవో నాయకుడు గద్దల రాజు, గీసుకొండ గ్రామ సర్పంచ్ వీరగోని రాజకుమార్, పంచాయతీ కార్యదర్శుల సంఘం అధ్యక్షుడు పోలు రాజేంద్ర ప్రసాద్, ఉపసర్పంచ్ కోట ప్రమోద్, పలువురు సర్పంచులు, ప్రజాప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శులు, ఈ-పంచాయతీ ఆపరేటర్లు, ఉపాధి హామీ సిబ్బంది, గ్రామ పంచాయతీ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

RNI No Tel / 2012 /4241
హైదరాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
తెలుగు దిన పత్రిక
hyderabadestate.co.in
18 శనివారం జూలై 2026

## సరికొత్త సామాజిక క్యాంపెయిన్.. రకుల్, సమంతలకు కాజల్ సవాల్!



టాలీవుడ్ స్టార్ హీరోయిన్ కాజల్ అగర్వాల్ తన లేటెస్ట్ చిత్రం 'ది ఇండియన్ స్టోరీ' ప్రమోషన్స్‌లో భాగంగా సామాజిక అవగాహన క్యాంపెయిన్‌ను ప్రారంభించింది. పురుగుమందుల వాడకం, ఆహార కల్తీ, దానివల్ల ప్రజల ఆరోగ్యంపై పడుతున్న దుష్ప్రభావాలను ఈ సినిమాలో చూపించారు. చేతన్ డీకే దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రంలో కాజల్, శ్రేయస్ తల్పడే జంటగా నటించారు. ఈ క్రమంలో, కాజల్ »#WhatsOnYourPlateµ (మీ ప్లేట్ లో ఏముంది) అవగాహన ప్రచారాన్ని ప్రారంభించింది. తన రాత్రి భోజనం ఫోటోను సోషల్ మీడియాలో పంచుకుంటూ, మనం తినే ఆహారం నిజంగా సురక్షితమేనా అని ప్రశ్నించింది. ప్రతి ఒక్కరూ తాము తినే ఆహారం పట్ల మరింత శ్రద్ధ వహించాలని కోరింది. ఈ ఛాలెంజ్‌లో టాలీవుడ్ స్టార్ హీరోయిన్లు రకుల్ ప్రీత్ సింగ్, సమంతలను కూడా పాల్గొనమని సవాల్ విసిరింది. నటుడు శ్రేయస్ తల్పడే కూడా కాజల్ అభిప్రాయాన్ని బలపరుస్తూ పోస్ట్ చేశాడు. ప్రజలందరూ బాధ్యతాయుతమైన వినియోగదారులుగా మారాలని, మనం ప్లేట్లలో పెట్టుకుని తినే ఆహారం వెనుక ఉన్న అసలు నిజాలు, నివేదించబడని సమస్యలపై చర్చ జరగాలని శ్రేయస్ పిలుపునిచ్చాడు. ఈ చిత్రం వివరాల్లోకి వస్తే... జీ స్టూడియోస్, ఎమ్ఐజీ ప్రొడక్షన్ స్టూడియోస్ సమర్పకులుగా వ్యవహరించాయి. సాగర్ బి. షిండే కథ అందించడంతో పాటు, నిర్మాతగానూ వ్యవహరించారు. ఈ చిత్రం జూలై 24న తెలుగు, తమిళ, హిందీ భాషల్లో విడుదల కానుంది. కాజల్ సృష్టించిన ఈ ఛాలెంజ్ నెటిజన్ల నుంచి మంచి స్పందన అందుకుంటోంది.

## నటుడిగా తెలుసు.. కానీ అసలు సిసలు వ్యాపార దిగ్గజం ఈ హీరో!





'కంపెనీ', 'సాథియా', 'యువ' వంటి చిత్రాలతో బాలీవుడ్‌లో నటుడిగా తనకంటూ ఓ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు వివేక్ ఒబెరాయ్. అయితే, వెండితెరపై కనిపించే ఈ నటుడికి మరోవైపు ఓ అపర కుబేరుడు, ఎంతో చాకచక్యమైన వ్యాపారవేత్త ఉన్నారన్న విషయం చాలామందికి తెలియదు. దాదాపు రూ.1200 కోట్ల నికర ఆస్తులతో వివేక్ ఒబెరాయ్ నిర్మించుకున్న వ్యాపార సామ్రాజ్యం బాలీవుడ్‌లోనూ, వ్యాపార వర్గాల్లోనూ ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. ఆయన ఈ స్థాయికి ఎలా చేరుకున్నారన్నది ఎంతో ఆసక్తికరమైన కథ.

చిన్ననాడే వ్యాపార పాఠాలు.. తండ్రి ఇచ్చిన స్ఫూర్తి

వివేక్ ఒబెరాయ్ వ్యాపార ప్రస్థానం చిన్న వయసులోనే మొదలైంది. ఆయన తండ్రి, ప్రముఖ నటుడు సురేశ్ ఒబెరాయ్.. వివేక్‌కు 10 ఏళ్ల వయసు నుంచే వ్యాపార మెళకువలు నేర్పించారు. "మా నాన్న నాకో వస్తువు ఇచ్చి, దాన్ని ఎలా అమ్మాలో పూర్తి బిజినెస్ ప్లాన్ తయారు చేయమని చెప్పేవారు. నేను ఆ వస్తువులను ఇంటింటికీ తిరిగి అమ్మాను. ఆ వయసులోనే వ్యాపారంలోని సూక్ష్మాలను అర్థం చేసుకోవడం ప్రారంభించాను" అని వివేక్ ఓ ఇంటర్వ్యూలో గుర్తుచేసుకున్నారు. "నేను ధనవంతుడిని, నువ్వు కాదు. నీ కాళ్లపై నువ్వే నిలబడి నీ సామ్రాజ్యాన్ని నిర్మించుకోవాలి" అని తన తండ్రి చెప్పిన మాటలే తనను ముందుకు నడిపించాయని వివేక్ వివరించారు.

నటుడు కాకముందే వ్యాపారవేత్త

వివేక్ సినిమాల్లోకి రాకముందే వ్యాపార రంగంలో అడుగుపెట్టారు. 19 ఏళ్ల వయసులోనే తన తోటి విద్యార్థులు కెరీర్ గురించి ఆలోచిస్తున్న సమయంలో వివేక్ స్టాక్ మార్కెట్‌పై పట్టు సాధించారు. అదే ఉత్సాహంతో తన మొదటి కంపెనీ కోసం 3 మిలియన్ డాలర్ల నిధులను సమీకరించారు. పెట్టుబడిదారులకు, తనకు మంచి లాభాలు తెచ్చిపెట్టి, 23 ఏళ్ల వయసులో ఆ కంపెనీని విజయవంతంగా అమ్మేశారు. ఆ అనుభవంతోనే భారత స్టాక్ మార్కెట్‌లో తొమ్మిది కంపెనీలను పబ్లిక్ ఇష్యూకు తీసుకెళ్లిన ఘనత ఆయనది. మరో నాలుగు కంపెనీలను కూడా మార్కెట్లోకి తీసుకురావడానికి ప్లాన్ చేస్తున్నట్లు తెలిపారు.

"సినిమా ప్యాషన్.. వ్యాపారం జీవనాధారం"

"వ్యాపారం నా ప్లాన్-బి. సినిమా నా అభిరుచి (ప్యాషన్)గా ఉండాలి, కానీ నా జీవనాధారం (దాల్ రోటీ) వ్యాపారం నుంచే రావాలని నిర్ణయించుకున్నా" అని వివేక్ స్పష్టం చేశారు. ఈ ఆలోచనా విధానం వల్లే బాలీవుడ్‌లోని లాబీయింగ్‌కు, పెద్ద మనుషులను ప్రసన్నం చేసుకునే రాజకీయాలకు దూరంగా, స్వేచ్ఛగా ఉండగలిగానని ఆయన చెప్పారు.

విస్తరించిన వ్యాపార సామ్రాజ్యం

వివేక్ తన పెట్టుబడులను కేవలం ఒక రంగానికి పరిమితం చేయలేదు. ఆయన వ్యాపార సామ్రాజ్యం ఎంతో వైవిధ్యమైనది.

దుబాయ్‌లో రియల్ ఎస్టేట్: కరోనా సమయంలో కుటుంబంతో కలిసి దుబాయ్‌కు మారిన వివేక్, అక్కడ భారీ వ్యాపార అవకాశాలను అందిపుచ్చుకున్నారు. ఆయనకు చెందిన 'బీఎన్‌డబ్ల్యూ డెవలప్‌మెంట్స్' అనే అప్పుల్లేని (zero`debt) రియల్ ఎస్టేట్ సంస్థ, యూఏఈలో ఏకంగా 7 బిలియన్ డాలర్ల విలువైన ఆస్తులను నిర్మిస్తోంది.

ల్యాబ్-గ్రోన్ డైమండ్స్: పుణెకు చెందిన 'సోలిటారియో' అనే ల్యాబ్-గ్రోన్ డైమండ్ బ్రాండ్‌లో వివేక్ పెట్టుబడులు పెట్టారు.

ఈ బ్రాండ్ ప్రస్తుతం 7 దేశాల్లో, 23 నగరాల్లో విస్తరించి, దాదాపు రూ.100 కోట్ల వార్షిక ఆదాయాన్ని నమోదు చేస్తోంది.

మద్యం పరిశ్రమ: 2025 మేలో స్కాట్లాండ్‌కు చెందిన ప్రీమియం మద్యం బ్రాండ్ 'రట్‌లాండ్ స్క్వేర్ స్పిరిట్స్ లిమిటెడ్'లో 21% వాటాను కొనుగోలు చేశారు. ఈ బ్రాండ్ విలువ సుమారు 30 మిలియన్ పౌండ్లు.


టెక్నాలజీ, ఇతర రంగాలు: వీటితో పాటు డీప్ టెక్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), లైఫ్ సైన్సెస్ వంటి 30కి పైగా కంపెనీలలో పెట్టుబడులు పెట్టినట్లు, వాటిలో 11 కంపెనీల నుంచి విజయవంతంగా బయటకు వచ్చినట్లు వివేక్ తెలిపారు. తండ్రి నేర్పిన పాఠాలతో చిన్న వయసులోనే వ్యాపార ప్రస్థానం మొదలుపెట్టి, సినిమా రంగంలో నటుడిగా రాణిస్తూనే.. అంతకుమించిన వ్యాపారవేత్తగా ఎదిగిన వివేక్ ఒబెరాయ్ ప్రయాణం నేటి యువతకు ఓ గొప్ప స్ఫూర్తిపాఠం.

## సోనమ్ వాంగ్‌చుక్‌ను చూసి '3 ఇడియట్స్' హీరో పాత్రను రూపొందించలేదు: ఆమిర్ ఖాన్



బాలీవుడ్ సూపర్ హిట్ చిత్రం '3 ఇడియట్స్'లోని ఫున్‌సుఖ్ వాంగ్డూ పాత్ర ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. ఈ పాత్రను అగ్ర కథానాయకుడు ఆమిర్ ఖాన్ పోషించిన సంగతి తెలిసిందే. అయితే, ఆ పాత్రకు లడఖ్‌కు చెందిన ప్రముఖ విద్యావేత్త, సామాజిక కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ స్ఫూర్తి అని చాలా కాలంగా ప్రచారం జరుగుతోంది. తాజాగా ఈ విషయంపై ఆమిర్ ఖాన్ స్వయంగా స్పందించారు. ఆ ప్రచారంలో వాస్తవం లేదని స్పష్టం చేశారు. సోనమ్ వాంగ్‌చుక్‌కు, ఆ పాత్రకు ఎలాంటి సంబంధం లేదని వెల్లడించారు. లండన్ ఇండియన్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో ఆమిర్ మాట్లాడారు. '3 ఇడియట్స్' కథా చర్చల సమయంలో తమకు సోనమ్ వాంగ్‌చుక్ గురించి తెలియదని పేర్కొన్నారు. వ్యక్తిగతంగా కూడా ఆయన్ను ఎప్పుడూ కలవలేదని చెప్పారు. అందుకే ఫున్‌సుఖ్ వాంగ్డూ పాత్రను ఆయన జీవితం ఆధారంగా రూపొందించలేదని స్పష్టం చేశారు. ఈ సినిమాలో 'చతుర్' పాత్ర పోషించిన ఓమీ వైద్య విడుదల చేసిన ఒక వీడియోపై కూడా ఆమిర్ స్పందించారు. ఫున్‌సుఖ్ పాత్ర సోనమ్ వాంగ్‌చుక్‌ను చూసి రూపొందించారని ఓమి చెప్పడం సరికాదని ఆయన అన్నారు. ఆ వ్యాఖ్యల్లో వాస్తవం లేదని తేల్చిచెప్పారు. అయితే, సోనమ్ వాంగ్‌చుక్ చేస్తోన్న సామాజిక సేవలను తాను ఎంతగానో గౌరవిస్తానని ఆమిర్ తెలిపారు. ప్రస్తుతం ఆయన చేస్తోన్న నిరవధిక నిరాహార దీక్ష గురించి ప్రస్తావిస్తూ.. సోనమ్ ఆరోగ్యం క్షీణిస్తోందని, దీక్ష విరమించాలని పలువురు కోరుతున్నారని చెప్పారు. వాంగ్‌చుక్‌ను గౌరవించడానికి '3 ఇడియట్స్' పాత్రతో ముడిపెట్టాల్సిన అవసరం లేదని, ఆయన చేస్తోన్న కృషి అసామాన్యమైనదని ఆమిర్ కొనియాడారు. నీట్ పేపర్ లీక్ వివాదం నేపథ్యంలో సోనమ్ వాంగ్‌చుక్ గత 20 రోజులుగా నిరవధిక నిరాహార దీక్ష చేస్తున్న విషయం తెలిసిందే. పేపర్ లీక్‌కు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తన పదవికి రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేస్తున్నారు. రోజురోజుకూ ఆయన ఆరోగ్యం క్షీణిస్తుండడంతో వెంటనే దీక్ష విరమించాలని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు, కేంద్ర ప్రభుత్వం ఆయన డిమాండ్లను పరిగణనలోకి తీసుకోవడం లేదనే విమర్శలు కూడా వెల్లువెత్తుతున్నాయి.

## గ్రీకు అందాలతో సెగలు పుట్టిస్తున్న మలైకా అరోరా!



మలైకా అరోరాను చూస్తే అమ్మాయిలు సైతం కుళ్ళుకునేలా తన అందాలతో ఎప్పటికప్పుడు మెస్మరైజ్ చేస్తూ ఉంటుంది. వరుస సినిమాలు, నిత్యం షూటింగ్ లతో బిజీగా గడిపేస్తూ తమకంటూ సమయాన్ని కేటాయించుకోలేక సతమతమవుతున్న ఎంతోమంది సెలబ్రిటీలు.. కాస్త సమయం దొరికితే చాలు వెకేషన్ కి వెళ్ళిపోవాలని చూస్తూ ఉంటారు. ముఖ్యంగా మన ఇండియన్ సెలబ్రిటీలు ఎక్కువగా విదేశాలను ఎంచుకుంటూ.. తమ ట్రిప్ లో భాగంగా నచ్చిన దేశానికి వెళ్ళిపోతూ ఎంజాయ్ చేస్తూ ఉంటారు. అక్కడ వారు ఎంజాయ్ చేయడమే కాదు.. ఆ ప్రాంతాలను మనకి కూడా పరిచయం చేస్తూ ఇంస్టాగ్రామ్ వేదికగా అలరిస్తున్నారు. టాలీవుడ్ మొదలుకొని బాలీవుడ్ వరకు ఎంతో మంది సెలబ్రిటీలు ఇలా పక్క దేశాలకు వెకేషన్ కి వెళ్ళిపోయి అక్కడి అందాలను పరిచయం చేస్తూ ఊహించని పాపులారిటీ సొంతం చేసుకుంటున్నారు. ఈ క్రమంలోనే ఒక బ్యూటీ తన వెకేషన్ లో భాగంగా గ్రీకు దేశానికి వెళ్ళింది యూరోపియన్ అందాలను చూపిస్తూ ఇంస్టాగ్రామ్ వేదికగా సందడి చేసింది. 52 ఏళ్ల వయసులో కూడా నిత్యం యవ్వనంగా కనిపిస్తూ గ్లామర్ టచ్ తో కుర్రకారుకు నిద్ర లేకుండా చేస్తోంది ఈ ముద్దుగుమ్మ. మలైకా అరోరాను చూస్తే అమ్మాయిలు సైతం కుళ్ళుకునేలా తన అందాలతో ఎప్పటికప్పుడు మెస్మరైజ్ చేస్తూ ఉంటుంది. ఇకపోతే తాజాగా ఇన్స్టాగ్రామ్ వేదికగా కొన్ని ఫోటోలను షేర్ చేసింది మలైకా.. అందులో భాగంగానే గ్రీక్ అందాలతో అభిమానులను ఆకట్టుకున్న ఈమె.. అక్కడ విలాసవంతమైన రిసార్ట్ అందాలను కూడా చూపించింది. బికినీను తలపించేలా డ్రస్సులు ధరించి తన గ్లామర్ టచ్ తో కుర్రకారు గుండెల్లో గుణపం దింపేసింది.. ఒకవైపు గ్లామర్ అందాలు మరొకవైపు గ్రీకు వేసవి సెలవుల్లో తన గ్లామర్ తో హీట్ పుట్టించేసింది మలైకా అరోరా. ఇక తాజాగా తన వెకేషన్ లో భాగంగా షేర్ చేసిన ఈ ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ గా మారుతున్నాయి. ం వీజేగా తన కెరీయర్ ను మొదలుపెట్టి.. హోస్ట్ గా అవతరించి అందరి దృష్టిని ఆకట్టుకున్న మలైకా అరోరా.. నటి మాత్రమే కాదు డాన్సర్, మోడల్ గా కూడా మంచి పేరు సొంతం చేసుకుంది. 1990 నుండే స్పెషల్ సాంగ్ లకు కేరాఫ్ అడ్రస్ గా నిలిచిన అరోరా మీడియాలో మాత్రం ఫిట్నెస్ ఐకాన్ గా గుర్తించబడింది. సల్మాన్ ఖాన్ సోదరుడు ప్రముఖ నటుడు, నిర్మాత అయిన అర్బాజ్ ఖాన్ ను వివాహం చేసుకున్న ఈమె తన భర్తతో కలిసి నిర్మాతగా అరంగేట్రం చేసింది. అమీర్ ఖాన్ దంగల్ చిత్రాన్ని అర్బాజ్ ఖాన్ ప్రొడక్షన్స్ సంస్థ నిర్మించిన విషయం తెలిసిందే. ఇక భర్తతో పలు చిత్రాలను నిర్మించిన ఈమె మధ్యలో విభేదాలు రావడంతో 2017లో అతడి నుంచి విడిపోయింది. ఒక కొడుకు కూడా ఉన్నారు. ఇకపోతే మలైకా అరోరా తన సినిమాల కంటే కూడా వ్యక్తిగత కారణాలవల్లే ఎక్కువగా వార్తల్లో నిలిచింది. వయసులో తనకంటే చిన్న వారైనా అర్జున్ కపూర్ తో చాలాకాలం ప్రేమలో ఉన్నట్లు వార్తలు కూడా వినిపించాయి. ఇక తర్వాత ప్రముఖ వ్యాపారవేత్త , వజ్రాల వ్యాపారి అయినా హర్ష్ మెహతాతో డేటింగ్ లో ఉన్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. నిజానికి వీరు తమ బంధాన్ని అధికారికంగా ప్రకటించకపోయినా. బహిరంగ కార్యక్రమాలలో, విమానాశ్రయాలలో పలు వెకేషన్లలో తరచూ కలిసి కనిపిస్తుండడంతో సోషల్ మీడియాలో ఈ జంటపై విస్తృతంగా వార్తలు వినిపిస్తున్నాయి.

## తెలుగు ఇండస్ట్రీని ఆకాశానికెత్తిన రకుల్ ప్రీత్.. బాలీవుడ్‌పై తీవ్ర విమర్శలు



టాలీవుడ్, బాలీవుడ్ చిత్ర పరిశ్రమల పనితీరుపై కథానాయిక రకుల్ ప్రీత్ సింగ్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తెలుగు చలనచిత్ర పరిశ్రమలోని సహకార స్ఫూర్తిని కొనియాడిన ఆమె, బాలీవుడ్‌లో మాత్రం అభద్రతాభావం, అసూయ వంటి ధోరణులు ఎక్కువగా కనిపిస్తాయని అభిప్రాయపడ్డారు. ఇటీవల ఒక ఇంటర్వ్యూలో పాల్గొన్న రకుల్, తన సినీ ప్రయాణం మొదలైన తెలుగు చిత్ర పరిశ్రమపై ప్రశంసలు కురిపించారు. "టాలీవుడ్‌లో ఒకరి సినిమాలను మరొకరు బహిరంగంగా ప్రోత్సహిస్తారు. తోటి నటీనటుల చిత్రాల ట్రైలర్లను వదుదల చేయడం, వేడుకలకు హాజరవ్వడం వంటివి ఇక్కడ సాధారణం. వృత్తిపరమైన పోటీ ఉన్నప్పటికీ, ఒకరి విజయాన్ని మరొకరు మనస్ఫూర్తిగా ఆస్వాదిస్తారు" అని ఆమె పేర్కొన్నారు. ఈ విషయంలో బాలీవుడ్ పరిస్థితి భిన్నంగా ఉంటుందని, అక్కడ అసూయ, అభద్రతాభావం కారణంగా పరస్పర సహకారం చాలా తక్కువని ఆమె అన్నారు. కొందరు కావాలనే ఇతరులపై ప్రతికూల ప్రచారాలు (నెగెటివ్ పీఆర్ క్యాంపెయిన్లు) నిర్వహిస్తారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. "తెలుగు పరిశ్రమలో ఐక్యత, సహృద్భావం మెండుగా ఉంటాయి. ఈ లక్షణాలను హిందీ పరిశ్రమ కూడా అలవర్చుకుంటే అది మరింత బలోపేతం అవుతుంది" అని రకుల్ సూచించారు. గతంలోనూ అల్లు అర్జున్, మహేశ్ బాబు వంటి అగ్ర హీరోల వినయాన్ని, వృత్తి పట్ల వారికున్న నిబద్ధతను ఆమె కొనియాడారు. దక్షిణాదిలో గడించిన అనుభవాలే తన కెరీర్‌ను తీర్చిదిద్దాయని, ఇక్కడి ప్రేక్షకుల ఆదరణ వల్లే తాను ఈ స్థాయిలో ఉన్నానని ఆమె కృతజ్ఞత చాటుకున్నారు. రకుల్ చేసిన ఈ వ్యాఖ్యలపై సామాజిక మాధ్యమాల్లో విశేష స్పందన లభిస్తోంది. ముఖ్యంగా తెలుగు ప్రేక్షకులు ఆమెపై ప్రశంసలు కురిపిస్తున్నారు. తన ఎదుగుదలకు తోడ్పడిన పరిశ్రమ పట్ల ఆమె చూపిన గౌరవానికి నెటిజన్లు హర్షం వ్యక్తం చేస్తున్నారు.







